ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 7 డిసెంబరు 2024



## అంబేడ్కర్‌కు నివాళి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ బుచ్చెయ్య పేట మండలం వడ్డాదిలో నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతిలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ

**పని ఒత్తిడి తగ్గించాలని కోరిన నర్సులు**

రెగ్యులర్ చేయాలని మలేరియా విభాగం కాంట్రాక్టు సిబ్బంది విజ్ఞప్తి




వినతులు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

- కమీషన్ 9.5 శాతం నుంచి 20 శాతానికి పెంచాలని కోరిన మద్యం డీలర్లు
- తమ ఆస్తులు కబ్జాకు గురయ్యాయని, విచారించి న్యాయం చేయాలని పలువురు వేడుకోలు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): **ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. గురువారం రాత్రి ముంబై నగరానికి చేరుకున్న ఆయన పార్టీ కార్యాలయంలో బస చేశారు. ముఖ్యమంత్రి నగరంలో ఉన్న విషయం తెలుసుకున్న పలువురు శుక్రవారం ఉదయం పార్టీ కార్యాలయానికి వచ్చారు. తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.**

నగరంలోని అల్లిపురం ప్రాంతంలో ఉంటున్న నరసింగరావు దంపతులు తమకు గోపాలపట్నంలో ఉన్న ఇంటిని వేరొకరు కబ్జా చేశారని ఫిర్యాదు చేశారు. కేజీహెచ్‌లో వాటర్ వర్క్స్‌కు సంబంధించి సూపరింటెండెంట్ బిల్లులు ఇవ్వడం లేదని, ప్రస్తుతం తాను అప్పుల్లో ఉన్నానని కాంట్రాక్టరు గణేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, టీచింగ్ ఆస్పత్రుల్లో పని ఒత్తిడి తగ్గించాలని, అవసరం మేర కొత్తగా నియామకాలు చేపట్టాలని, భద్రత పెంచాలని నర్సులు వినతిపత్రం సమర్పించారు. వారసత్వంగా వచ్చిన భూమిని గ్రామంలో కొందరు వారి పేరిట మ్యుటేషన్ చేయించుకున్నారని, విచారణ జరిపించి న్యాయం చేయాలని రాంబిల్లి మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన నాగుమంతు నరసింహరావు విజ్ఞాపనపత్రం సమర్పించారు. పాతికేళ్లుగా పనిచేస్తున్న తమ సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని మలేరియా విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది కోరారు. జీవీఎంసీ పరిధిలోని లక్ష్మీపురం ఏరియాలో తాను కొనుగోలు చేసిన స్థలాన్ని వైసీపీ నేత ఆక్రమించుకున్నారని విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి సీహెచ్‌వీఎస్ నారాయణ ... మిగతా 10వ పేజీలో



డీప్ టెక్నాలజీపై నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

## విశాఖ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

**నగరాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తాం**

- అనేక కీలక సంస్థలు రాబోతున్నాయి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 'డీప్ టెక్నాలజీ'పై శుక్రవారం నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపు అనంతరం మీడియాతో మాట్లాడారు. విజన్-2047లో భాగంగా విశాఖ కోసం ప్రత్యేకంగా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. విశాఖను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖ మెట్రో రైల్ డీపీఆర్‌ను ఆమోదించి కేంద్రానికి పంపించినట్టు చెప్పారు. విశాఖ కేంద్రంగా ... మిగతా 10వ పేజీలో

# రెవెన్యూ సదస్సులకు అనూహ్య స్పందన!

**భూసంబంధిత సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ**

- తొలిరోజు 25 గ్రామ సభలు, 379 దరఖాస్తుల స్వీకరణ
- 16 అర్జీలకు అక్కడికక్కడే పరిష్కారం



అనకాపల్లి మండలం కోడూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి. చిత్రంలో ఆర్డీవో షేక్ ఆయిషా వున్నారు.

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) **దీర్ఘకాలంగా పేరుకుపోయిన భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమైన రెవెన్యూ సదస్సులకు అనూహ్య స్పందన లభిస్తున్నది. భూ సంబంధిత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. మండల రెవెన్యూ అధికారులు రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఆయా మండలాల్లో రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. తొలిరోజు సదస్సుకు అర్జీలు వెల్లువెత్తాయి. పెద్ద సంఖ్యలో భూ యజమానులు హాజరై సమస్యలపై అర్జీలు అందజేశారు. రెవెన్యూ సదస్సులు జనవరి 8వ తేదీ వరకు జరగనున్నాయి.**

అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లలోనిఇ 24 మండలాల్లో 721 రెవెన్యూ గ్రామాలుండగా తొలిరోజు శుక్రవారం 25 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు విజయవంతంగా జరిగాయి. భూ యజమానులు అధిక సంఖ్యలో సదస్సులకు హాజరై దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం కోరుతూ అర్జీలు పెట్టుకున్నారు. అధికారులు స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు అక్కడిక్కడే రశీదులు ఇచ్చారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం 45 రోజుల్లో సమస్యకు ఎటువంటి పరిష్కారం చూపారు, ఇతరత్రా వివరాలను దరఖాస్తుదారులకు తెలియపరుస్తారు.

### తొలిరోజు 25 సదస్సులు.. 379 అర్జీలు

జిల్లాలో తొలి రోజు అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 12 మండలాల్లో 11 సదస్సులు, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 12 మండలాల్లో 14.. మొత్తం 25 సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి 379 దరఖాస్తులు స్వీకరించారు. 22ఏ ప్రభుత్వ భూ రికార్డు నుంచి తొలగింపు కోరుతూ ఐదు దరఖాస్తులు, వెబ్‌ల్యాండ్‌లో తప్పుల సవరణ కోసం 26, వారసత్వంగా సంక్రమించిన భూముల బదలాయింపు (మ్యుటేషన్) కోసం 174, భూకబ్జాలపై 6, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై 3, రీసర్వే సమస్యలపై 3, అటవీ భూముల ఆక్రణపై 4, దేవదాయ శాఖ భూముల కబ్జాలపై 4, ఇతరత్రా భూసంబంధిత సమస్యలపై 154.. మొత్తం 379 దరఖాస్తులు అందాయి. సుమారు 425 ఎకరాల భూములకు సంబంధించి 395 మంది రెవెన్యూ సదస్సులకు హాజరై తమ అర్జీలను సమర్పించారు. వీటిలో 16 అర్జీలకు సదస్సులో అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ఇంకా 363 దరఖాస్తులను పరిశీలించి చర్యలు చేపట్టాల్సి ఉంది.

# నేడు పాఠశాలల్లో పండుగ

**పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు**

- మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు టగ్ ఆఫ్ వార్...
- అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం
- పాఠశాల అభివృద్ధికి, బోధనకు సంబంధించి సూచనలు స్వీకరణ
- విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు భోజనం ఏర్పాట్లు
- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు



ఎస్.రాయవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పేరెంట్, టీచర్ మీటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో జి.అప్పారావు నాయుడు

అనకాపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహణకు విద్యా శాఖ విస్తృత ఏర్పాట్లుచేసింది. ప్రతి పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం జరగనున్నది. ఈ సందర్భంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం వరకూ పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయా పాఠశాల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఆరోగ్యం, మౌలిక వసతులపై చర్చించి విద్యా ప్రగతికి ప్రణాళికలు రూపొందించనున్నారు. మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహణకు జిల్లాకు రూ.27,88,400 ... మిగతా 10వ పేజీలో

# న్యాయంపూడికి నేషనల్ అవార్డు

**సమృద్ధిగా తాగునీటి సరఫరా కేటగిరీలో మొదటి ర్యాంకు**

- దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారానికి ఎంపిక
- 11న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డుతోపాటు రూ.కోటి ప్రోత్సాహకం
- ఆనందోత్సాహాల్లో గ్రామస్థులు



న్యాయంపూడిలో ఇంటింటికీ కొళాయి.. తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

నక్కపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాయంపూడి పంచాయతీ జాతీయ స్థాయిలో దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారానికి ఎంపిక కావడంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పురస్కారం కోసం న్యాయంపూడి పంచాయతీని అక్టోబరు 8వ తేదీన కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన ప్రతినిధులు అనిల్ గైక్వాడ్, అనిల్ నిబోర్కర్ పరిశీలించి కేంద్రానికి నివేదికను సమర్పించారు. తాగునీటి సరఫరా విభాగంలో న్యాయంపూడి ... మిగతా 10వ పేజీలో

### చాలా ఆనందంగా ఉంది



మా పంచాయతీకి జాతీయ స్థాయి అవార్డు రావడం చాలా ఆనందంగా వుంది. మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శి సిబ్బంది సహకారం, ప్రజల ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైంది. ఈ నెల 11న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోనుండడం జీవితంలో మరిచిపోలేని సంఘటన. భవిష్యత్తులో మా పంచాయతీకి మరిన్ని సేవలు అందజేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాను.

**రెడ్డి వరహాలు**, పంచాయతీ సర్పంచ్, న్యాయంపూడి

### కలెక్టర్ అభినందనలు

అనకాపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు గ్రామ పంచాయతీలు దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్‌కు ఎంపికయ్యాయని కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 11వ తేదీన న్యూఢిల్లీలో జరిగే జాతీయ గ్రామ పంచాయతీ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ఆయా పంచాయతీలకు పురస్కారాలు అందిస్తారని పేర్కొన్నారు. జిల్లా నుంచి నక్కపల్లి మండలం డీఎల్ పురం, న్యాయంపూడి, అనకాపల్లి మండలం తగరంపూడి, తుమ్మపాల గ్రామ పంచాయతీలు రాష్ట్ర స్థాయి పురస్కారాలకు ఎంపికకాగా వీటిలో న్యాయంపూడి, తగరంపూడి పంచాయతీలు జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికయ్యాని వెల్లడించారు. న్యాయంపూడి పంచాయతీ నీటి సరఫరా విభాగంలో, తగరంపూడి పంచాయతీ పచ్చదనం, పరిశుభ్రత విభాగంలో ఎంపికైనట్టు తెలిపారు. జాతీయస్థాయి పురస్కారాలకు రాష్ట్రం నుంచి నాలుగు పంచాయతీలు ఎంపిక కాగా అందులో అనకాపల్లి జిల్లాకు చెందిన రెండు పంచాయతీలు ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు. జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, ఆయా పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, ఇతర అధికారులను కలెక్టర్ అభినందించారు.

# తగరంపూడికి జాతీయ పురస్కారం

**పచ్చదనం-పరిశుభ్రత విభాగంలో ఎంపిక**

కొత్తూరు (అనకాపల్లి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారానికి అనకాపల్లి మండలం తగరంపూడి పంచాయతీ ఎంపికైంది. పచ్చదనం-పరిశుభ్రత విభాగంలో జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచినట్టు అధికారులు వెల్లడించారు. పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపుతోపాటు ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలను చేపట్టడంలో ఈ పంచాయతీ ముందుంది. సంపద తయారీ కేంద్రంలో వ్యర్థాల నిర్వహణ ఆదర్శనీయంగా నిలిచింది. గ్రామస్థులతోపాటు ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే పురస్కారానికి ఎంపికైందని ఇటీవల వరకు ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఎస్తేరు తెలిపారు.



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

### పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



పచ్చదనం పరిశ్రభతపై జాతీయ స్థాయి పురస్కారానికి మా పంచాయతీ ఎంపిక కావడం ఆనందంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం అవార్డుతోపాటు ఇచ్చే రూ.కోటితో పంచాయతీని మరింత అభివృద్ధి చేసుకుని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. చెత్త తరలించడానికి బ్యాటరీతో నడిచే వాహనాలు కొనుగోలు చేసి, ఒక పార్కును నిర్మించుకుంటాం.

- యాదగిరి అప్పారావు, సర్పంచ్, తగరంపూడి

# నేడు ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం

**దేశ, విదేశాల నుంచి సుమారు రెండు వేల మంది రాక**

- ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ సంస్థ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథిగా పద్మశ్రీ డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణ, విశిష్ట అతిథిగా మంత్రి నారా లోకేశ్ హాజరు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం శనివారం ఆర్కే బీచ్ రోడ్డులోని వర్సిటీ కన్వెన్షన్ హాలులో జరగనున్నది. ఈ వేడుకలకు దేశ, విదేశాల నుంచి సుమారు రెండు వేల మంది పూర్వ విద్యా ర్థులు హాజరుకానున్నారు. వేడుకలకు నేరుగా హాజరు కాలేని వారి కోసం లైవ్ టెలీకాస్ట్ ఇవ్వనున్నారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏయూ అధికారులతోపాటు పూర్వ విద్యార్థుల సంఘం (ఏఏఏ) ప్రతి నిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అతిథులు, ప్రముఖులను ఆహ్వానిం చేందుకు, వారిని విభాగాలు, వేడుకలు జరిగే ప్రాంగ ణానికి తీసుకువెళ్లేందుకు, ఇంకా కార్యక్రమానికి హాజరయ్యే వారందరికీ స్నాక్స్ పంపిణీ, గుర్తింపు కార్డులు పరిశీలించి లోపలకు పంపించేందుకు సీనియర్ ఫ్యాకల్టీ 30 మందితో పది కమిటీలను ఏర్పాటు చేశారు.



**అతిథులు...**

పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ సంస్థ చైర్మన్, మేనే జింగ్ డైరెక్టర్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథిగా పద్మశ్రీ డాక్టర్ ... మిగతా 10వ పేజీలో

# నర్సీపట్నంలో ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య

**లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణం**

- సొంతూరు నాతవరం మండలం మర్రిపాలెం
- కశ్మీర్‌లో విధులు.. 5వ తేదీన సెలవుపై రాక



శివ అప్పలనాయుడు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ ఉద్యోగి ఒకరు నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న లాడ్జిలో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు... నాతవరం మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన బొచ్చా శివ అప్పలనాయుడు పదేళ్ల నుంచి ఆర్మీలో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం జమ్ముకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సుమారు మూడేళ్ల క్రితం విశాఖపట్నానికి చెందిన హేమలతతో వివాహం జరిగింది. ప్రస్తుతం వీరికి రెండేళ్ల కుమార్తె వుంది. కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న అప్పలనాయుడు.. సెలవుపై గురువారం ఉదయం స్వగ్రామం మర్రిపాలెం వచ్చాడు. సాయంత్రం వరకు కుటుంబ సభ్యులతో గడిపాడు. అనంతరం నర్సీపట్నం వచ్చి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా వున్న కె.ఎస్.ఆర్. లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. అయితే శుక్రవారం సాయంత్రం ఆరు గంటల వరకు గది తలుపులు తెరవకపోవడంతో లాడ్జి సిబ్బందికి అనుమానం వచ్చి గది తలుపులు తెరిచారు. అప్పలనాయుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. దీంతో సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయగా టౌన్ సీఐ గోవిందరావు వచ్చి వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

## ఎస్.రాయవరంలో పేరెంట్స్ సమావేశానికి హోంమంత్రి అనిత రాక

**» ఏర్పాట్లను పరిశీలించిన డీఈవో**

ఎస్.రాయవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి హోం మంత్రి వంగలపూడి అనిత హాజరు కానున్నారని ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా ఆ పాఠశాలలో చేస్తున్న ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావు నాయుడు, ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

## అట్టహాసంగా కనకమహాలక్ష్మి బోనాల పండగ



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

ఎలమంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మవరం పురవీధులన్నీ శుక్రవారం కనకమ్మ నామస్మరణతో మార్మోగింది. వేలాది సంఖ్యలో తరలివచ్చిన భక్తుల నడుమ అమ్మవారి బోనాలు పండగ అంగరంగ వైభవంగా సాగింది. తొలుత అమ్మవారికి గొల్లవిల్లి బాబులు దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలు సమర్పించారు. 108 మంది మహిళలు బోనాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. అమ్మవారి ఆలయం నుంచి వందలాది భక్తుల బోనాలతో కనకమహాలక్ష్మి నామస్మరణ చేసుకుంటూ కాకివానివీధి, ప్రధాన రోడ్డు మీదుగా ఆస్పత్రి జంక్షన్ నుంచి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడుకొఠారు సాంబశివరావు, కమిటీ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## మామిడి చెట్ల ఫలసాయానికి వేలం

పాయకరావుపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పార్కులో గల 13 మామిడి చెట్ల ఫలసాయానికి ఈనెల 16వ తేదీన వేలం నిర్వహించనున్నట్టు ఏఎస్‌డబ్ల్యూఓ జయలక్ష్మి తెలిపారు. అదేవిధంగా పార్కులో ఉన్న వివిధ రకాల 49 చెట్ల అమ్మకానికి అదే రోజున వేలం నిర్వహించనున్నామని తెలిపారు. అదేవిధంగా అదే రోజున పార్కులో ఉన్న మూడు బొద్ద, 20 తురంగ, 25 గానుగ, ఒక నవర చెట్ల అమ్మకానికి నిర్వహించే వేలం నిర్వహిస్తామన్నారు. ఈ వేలం పాటల్లో పాల్గొనేవారు వెయ్యి రూపాయలు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## వెంకటాపురంలో అశ్లీల నృత్యాలు

**» పలువురిపై కేసు నమోదు**

మునగపాక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెంకటాపురంలో అశ్లీల నృత్య ప్రదర్శన నిర్వహించిన వారిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్.ఐ పి.ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 5వ తేదీ రాత్రి వెంకటాపురంలో అనకాపల్లికి చెందిన ముగ్గురు అమ్మాయిలతో అశ్లీల నృత్యాలు చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు తాను, స్టేషన్ సిబ్బంది వెళ్లి అడ్డుకున్నట్టు చెప్పారు. ఎటు వంటి అనుమతులు తీసుకోకుండా డీజే సౌండ్‌లు, నృత్యాలు చేయడంపై కేసు నమోదు చేశామని చెప్పారు. అదేవిధంగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఎస్.తాతాజీ, ఎం.వీరునాయుడుతోపాటు నృత్యాలు చేసిన ముగ్గురు మహిళలు, ఆర్గనైజర్ త్రినాథ్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

## మత్తు పదార్థాలు అరికట్టాలని ఐద్వా వినతి

ఎలమంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి వంటి మత్తు పదార్థాలను అరికట్టాలని శుక్రవారం ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం, సెక్రటరీ మంగతాయారు పట్టణ ఎస్ఐ సావిత్రికి వినతిపత్రం అందజేశారు. వీటికి బానిసలై ఎందరో జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళలపై అఘాయిత్యాలు చోటుచేసుకుంటున్నాయని, వీటిని అరికట్టేందుకు నిరంతర కృషి చేయాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో లక్ష్మీపార్వతి, ప్రసన్న సూర్యకుమారి ఉన్నారు.

## సీఎం చంద్రబాబును కలిసిన దొడ్డి శ్రీను



మునగపాక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో కలిసి చంద్రబాబును కలిశానని చెప్పారు.

## 'అడ్డుకున్న వారి నుంచి రక్షణ కల్పించండి'

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేశవరం రెవెన్యూ గ్రామంలో ఉన్న మా భూమిలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వెంకటనగరం గ్రామానికి చెందిన నాగినేని నిర్మల, ఆమె కుమారుడు శ్రీనివాస్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేశవరం రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 145, 144లలో గతంలో ప్రభుత్వం ఇచ్చిన సుమారు 15 ఎకరాల డి పట్టా భూమిలో జీడిమామిడి తోటలు పెంచుకుని జీవిస్తున్నామన్నారు. అయితే తోటల్లోని జీడిపిక్కలు ఏరుకునేందుకు లీజుకి తీసుకున్న వ్యక్తులను ఇటీవల తోటల్లోకి వెళ్లకుండా వెంకటనగరానికి చెందిన కొంతమంది వ్యక్తులు అడ్డుకుంటూ బెదిరిస్తున్నారన్నారు. తమను బెదిరిస్తున్నవారి నుంచి రక్షణ కల్పించాలని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

## మంగవరంలో శిశు-వికాసం ర్యాలీ



మంగవరంలో శిశు-వికాసం ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు-వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంగవరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శిశు వికాసం, బాల్య వివాహాలు నిర్మూలన, దత్తత తీసుకోవడం, ఆడపిల్లలను చదివించడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు, టి.షరిష్మ, ఏఎన్ఎం చిన్నమ్మలు, హైస్కూల్ హెచ్ఎం విజయలక్ష్మి, ఎంపీపీ స్కూల్ హెచ్ఎం విజయలక్ష్మి, పీఈటీ గోపాలరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గొడిచెర్లలో జూనియర్ కళాశాల

**» ఇంటర్ విద్యా మండలి ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం**





నక్కపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో మరో జూనియర్ కళాశాల ఏర్పాటు కానుంది. ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాల నక్కపల్లిలో వుంది. జనాభా, విద్యార్థుల ప్రాతిపదికన ఇటీవల ఇంటర్ విద్యా మండలి జరిపిన సర్వేలో మండలానికి మరో జూనియర్ కళాశాల అవసరమని గుర్తించింది. ఈ మేరకు రాష్ట్రంలో 37 మండలాల్లో కొత్తగా జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఇంటర్ విద్యామండలి ప్రభుత్వానికి నివేదించింది. ఇందులో అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో కూడా అదనంగా మరో జూనియర్ కళాశాల ఏర్పాటు అవసరం వుందని పేర్కొంది. ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఆమోదించింది. ఈ జూనియర్ కళాశాల గొడిచెర్లలో ఏర్పాటయ్యే అవకాశాలున్నాయి. మెరక గ్రామాలకు కేంద్ర బిందువుగా వున్న గొడిచెర్లలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని గత 15 ఏళ్ల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. గత ఎన్నికల్లో కూడా హోం మంత్రి అనిత గొడిచెర్లలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని ఉద్దండపురం, గొడిచెర్ల, కొత్తూరు, రేబాక, గుల్లిపాడు, రమణయ్యపేట, చీడిక, జి. జగన్నాథపురం, ముకుందరాజుపేట, దోసలపాడు, దేవవరం, చినరామభద్రపురం, ఒడ్డిమెట్ట తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు టెన్త్ పూర్తయిన తరువాత పాయకరావుపేట లేదా తుని లో వున్న కళాశాలలకు వెళ్లి చదువుకోవల్సి వస్తోంది. బాలికలైతే అంత దూరం రోజూ వెళ్లి రావడం కష్టమని చాలామంది టెన్త్‌తోనే చదువు ఆపేస్తున్నారు. దీంతో గొడిచెర్లలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు కానుంది.

# అంబేడ్కర్‌కు ఘన నివాళి



ఎలమంచిలి: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ గోవింద్, ఎంపీడీఓ కొండలరావు

ఎలమంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంతోపాటు పలు గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ బోదెపు గోవింద్, ఎంపీడీఓ కేఎస్. కొండలరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మునిసిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, నేతలు కొల్లి త్రినాథ్, రాపేటి సంతోష్, మర్రి రాజు, గొంపాన అప్పారావు, చంటి, నర్సింగరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు. అదేవిధంగా మునిసిపల్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు గారా మురళీరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గొంపాన అప్పారావు, బి. అప్పారావు. పాము చిన్ని కుమార్. ఈ.చంటి. రాజు. జీవన్ కుమార్‌లు పాల్గొన్నారు. అలాగే ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి. మాణిక్యం, జాయింట్ సెక్రటరీ చందక మంగతాయారు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో లక్ష్మీపార్వతి, ప్రసన్న, సూర్య కుమారి పాల్గొన్నారు.

**అచ్యుతాపురంలో..**

అచ్యుతాపురంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో గుడాల వేణు, సమ్మింగా లక్ష్మణ, ఎంవీఆర్ రాహుల్, రాజా రమేష్, మద్దిల గణేష్, ఈరిగల రమణ, దేముడు తదితరులు పాల్గొన్నారు.

**మునగపాకలో..**

మునగపాక దళిత కాలనీలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసిలినాయుడు, గ్రామశాఖ అధ్యక్షుడు దాడి శివ, దళిత యువకులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సంతబయల గౌతమ పఠన మందిరం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, దళిత నాయకులు కోనపల్లి రామ్మోహన్‌రావు, పిల్లి అప్పారావు, రాజాన బుజ్జిబాబు, దిమ్మల నూకరాజు పాల్గొన్నారు.





పాయకరావుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు

**ఎస్.రాయవరంలో..**

మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి హెచ్ఎం బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్. అప్పలనాయుడు, గారా ప్రకాష్ పాల్గొన్నారు.

**పాయకరావుపేటలో..**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి శుక్రవారం పాయకరావుపేటలో ఘనంగా నిర్వహించారు. పాతపంచాయతీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీనివాస్, ధనిశెట్టి బాబు, దేవవరపు వెంకటేశ్వరరావు, వై.అన్నవరం పాల్గొన్నారు. దళిత బహుజన పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీబీపీ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను సాధించడమే భారత జాతి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో డీబీపీ నాయకులు దాసరి రామచంద్రరావు, చిరుకూరి అర్జునరావు, మాలమహానాడు అసెంబ్లీ ఇన్‌చార్జి బడుగు అచ్చారావు, బోడపాటి లక్ష్మి, జెక్కల సూరిబాబు, పెనుపోతుల సరస్వతి పాల్గొన్నారు.

**కోటవురట్లలో..**

మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని కైలాసపట్నం, రాట్నాపాలెం, కోటవురట్ల, చౌడువాడ గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. రాట్నాలపాలెం ఎస్సీకాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, పందూరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు చీకెట్ల భాస్కరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలవేలి కొటి, గంటేడ లోవరాజు, కాకరకుమార్, గంటేడ అప్పలరాజు, తదితరలు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులు ప్రారంభం





అచ్యుతాపురం: నునపర్తిలో రెవెన్యూ సదస్సు జరుగుతున్న దృశ్యం

రాంబిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఇ.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని మురకాడలో శుక్రవారం రెవెన్యూ సదస్సును ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయ్యాల శ్రీనివాసరావు, సర్పంచ్ జి.అప్పన్నదొర, ఆర్ఐ ఆర్.రవికుమార్, సర్వేయర్ ఆర్.త్రిమూర్తి పాల్గొన్నారు.

**మునగపాకలో..**

భూ సమస్యలు పరిష్కరించుకోవడానికి ఇది చక్కటి వేదికని మండల ప్రత్యేకాధికారి జి.ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం మండలంలో మెలిపాకలో ఆయన రెవెన్యూ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సమస్యలు ఏదైనా పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. సదస్సులో పది అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఆదిఉమామహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సర్వేయర్లు, వీఆర్వో వీఆర్ఏలు, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**అచ్యుతాపురంలో..**

మండలంలోని నునపర్తిలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఎనిమిది మంది రైతులు భూ సమస్యలపై ఫిర్యాదు చేశారు. అలాగే పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వలేదంటూ రైతులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ జనార్దన్, సర్పంచ్ చుక్క అనూరాధ, వీఆర్వో అనంతరావు, మండల సర్వేయర్ రాధ, గొంప నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**ఎస్.రాయవరంలో..**

మండలంలోని లింగరాజుపాలెంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 27 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ, నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ మూర్తి, డీటీ నీరజ, మండల సర్వేయర్ నరసింహమూర్తి పాల్గొన్నారు

**పాయకరావుపేట రూరల్‌లో..**

మండలంలోని శ్రీరాంపురంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 18 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దారు సత్యనారాయణ తెలిపారు. సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారుతోపాటు టీడీపీ నాయకుడు చించెలపు ప్రదీప్, మండల సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.

**ఎలమంచిలిలో..**

మండలంలోని బయ్యవరం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు గొన్నాబత్తుల శేషు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వరహాలు, మాజీ సర్పంచ్ గెంజి శ్రీను, కూటమి నేతలు ఎడ్ల నానాజీ, కంబాల భాస్కరరావు, కె.జోగారావు, నాని, మొల్లి అప్పారావు పాల్గొన్నారు

**కోటవురట్లలో..**

మండలం కైలాసపట్నం సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఎల్. తిరుమలబాబు మాట్లాడుతూ భూ వివాదాలపై వచ్చిన సమస్యలను 40 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కైలాసపట్నంలో 19 దరఖాస్తులు వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దాబత్తుల నాగేశ్వరరావు, సిద్దాబత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**నక్కపల్లిలో..**

మండలంలోని చినరాంభద్రపురం, దేవవరం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ నర్సింహమూర్తి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల యొక్క ఉద్దేశాన్ని తహసీల్దార్ రైతులకు వివరించారు.



కోటవురట్ల: కైలాసపట్నం రెవెన్యూ సదస్సులో అర్జీని అందజేస్తున్న రైతులు



నక్కపల్లి: రెవెన్యూ సదస్సునిర్వహిస్తున్న తహసీల్దార్ నర్సింహమూర్తి

# ముడి సరుకు రాక మరో ఫెర్రో కంపెనీ తాత్కాలిక మూత



టఫ్ మెటలాజికల్ కర్మాగారం

అచ్యుతాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లో ఫెర్రో కర్మాగారాలు వివిధ సమస్యలతో మూతపడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు తగ్గడంతో మూడు రెండు నెలల క్రితం అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారాన్ని మూసి వేశారు దీంతో వెయ్యి మంది కార్మికులు రోడ్డున పడ్డారు. వారం రోజుల క్రితం రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి ప్రైవేట్ లిమిటెడ్ ఫెర్రో కర్మాగారంలో ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వారు విధులు బహిష్కరించారు. దీంతో దిగివచ్చిన యాజమాన్యం ముందుగా ఒక నెల జీతం ఇచ్చి, మరో పది రోజుల్లో రెండో నెల జీతం కూడా ఇస్తామని హామీ ఇవ్వడంతో వారు విధులకు హాజరయ్యారు. అదే ప్రాంతంలో ఉన్న టఫ్ మెటలాజికల్ ప్రవేట్ లిమిటెడ్ కర్మాగారానికి ముడి సరుకు రాకపోవడంతో నవంబరు 16వ తేదీ నుంచి తాత్కాలికంగా మూసివేశారు. ఇక్కడ లైట్ కార్బన్ ఫెర్రో క్రోం తయారు చేస్తారు. ఇందులో 45 మంది శాశ్వత ఉద్యోగులు, మరో 55 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా ప్రతి రోజూ విధులకు కర్మాగారానికి వస్తున్నారని, ముడి సరుకు దిగుమతి అయిన వెంటనే కర్మాగారాన్ని పునఃప్రారంభిస్తామని కర్మాగారం హెడ్ వర్మ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

## ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు

**» పోలీసులకు ఫిర్యాదు చేసిన కూటమి నాయకులు**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

అచ్యుతాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌పై ఒక సోషల్ మీడియాలో వచ్చిన కథనానికి కూటమి నాయకులు తీవ్రంగా స్పందించారు. ఆ చానల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అచ్యుతాపురంలో జరిగిన విలేకర్ల సమావేశంలో కూటమి నాయకుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌పై తీవ్రమైన పదజాలంతో ఒక ఫేక్ కథనం ప్రచురించారని మండిపడ్డారు. ఎమ్మెల్యే విజయకుమార్ బ్రోకర్ అని, టోల్ గేట్ పెట్టి వాహనాల నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నట్లు అభ్యంతరకరమైన కథనం ప్రచురించారన్నారు. తాము విచారించగా మునగపాకలో ఒక అనధికార లేఅవుట్ వేస్తున్నారు. దీనిని అధికారులు అడ్డుకున్నారు. దీనిపై కక్షగట్టిన ఆ రియాల్టర్ ఒక ఛానల్‌లో కథనాన్ని రాయించినట్టు తేలిందన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఐ గణేష్‌కి ఫిర్యాదు చేసినట్టు కూటమి నాయకులు తెలిపారు. అంతేకాక ఆ చానల్‌పై పరువు నష్టం దావా కూడా వేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు జనపరెడ్డి నర్సింగరావు, దిన్‌బాబు, జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాను, దొడ్డి శ్రీను, ద్వారపురెడ్డి బాపూజీ, కొరుప్రోలు చిన్నారావు, మేరుగు ప్రవీణ్, లాలం చందు, లాలం రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పేరెంట్స్ సమావేశం ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లపై ఆరా తీస్తున్న డీఆర్‌డీఏ పీడీ శచిదేవి

నక్కపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, కేజీబీవీ సహా ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు జరగనున్నాయి. ఎంఈవోలు కె.నరేశ్, వేమగిరి నూకరాజు పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ శచిదేవి నక్కపల్లి జడ్పీ బాలికల హైస్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు.

## అంబేడ్కర్ విగ్రహానికి రక్షణ కల్పించాలి



సీఐ గణేశ్‌కి ఫిర్యాదు చేస్తున్న దళిత నాయకులు

అచ్యుతాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి రక్షణ కల్పించాలని దళిత సంఘ నాయకులు గుడాల వేణు, సమ్మింగా లక్ష్మణ శుక్రవారం సీఐ నమ్మి గణేష్‌కి ఫిర్యాదు చేశారు. ఇక్కడ 30 ఏళ్ల క్రితం మూడు సెంట్ల భూమిలో అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి, చుట్టూ ఇనుప కంచె వేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఇనుప కంచెను తొలగించడంతో విగ్రహం చుట్టూ ఆక్రమణలకు గురయ్యాయి. వీటి ఆక్రమణలు తొలగించాలని వారు కోరారు

## మహాసభల వాల్‌పోస్టర్ విడుదల

అచ్యుతాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13, 14 తేదీల్లో ఎలమంచిలిలో జరిగే ఎస్ఎఫ్ఐ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. బాలాజీ కోరారు. శుక్రవారం ఇక్కడ వాల్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీతోపాటు బీసీ హాస్టల్ కూడా ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మ, రాము, సునీల్, గణేష్ పాల్గొన్నారు.

## స్థల దాత కుటుంబ సభ్యులకు సత్కారం



దశమంతరావు కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

రాంబిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కట్టుబోలులో కొలువైన కైలాస ఈశ్వర స్వామి ఆలయానికి భూమిని ఇచ్చిన దాత దశమంతరావు కుటుంబ సభ్యులను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. మూడు వందల సంవత్సరాల క్రితం నిర్మించిన శివాలయం శిథిలావస్థకు చేరడంతో 2022 సంవత్సరంలో ఈ స్వామివారి ఆలయాన్ని పునర్నిర్మాణం చేశారు. ప్రహరీ గోడ నిర్మాణానికి స్థలం అవసరమైంది. ఆలయం పక్కనే ఉన్న స్థలం దశమంతరావు కుటుంబ సభ్యులకు చెందింది. ఆలయ నిర్మాణ కమిటీ, గ్రామ సర్పంచ్, గ్రామస్థులు అడిగిన వెంటనే వారు స్థలం ఇచ్చారు. దీంతో ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. దశమంతరావు కుటుంమ సభ్యులైన నాగ పరమేశ్వరరావు, రామన్, పెద్ద సన్యాసిరావు, శివప్రసాద్‌లను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి.ఈశ్వరరావు, ఎలమంచిలి నాగేశ్వరరావు, దాడి నూకులు, దశమంతరావు వెంకటసన్నయ్య, సర్పంచ్ అగ్రహారపు ఆదిలక్ష్మి, గ్రామ నాయకులు బాబూరావు, భవానీలు నక్కనాగేశ్వరరావు, కసిరెడ్డి బాబూరావు పాల్గొన్నారు.

## విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

అచ్యుతాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సీఐ నమ్మి గణేష్ అన్నారు. శుక్రవారం స్థానిక భవానీ విద్యానికేతన్‌లో జరిగిన యాంటీ డ్రగ్ అడిక్షన్ డ్రైవ్‌లో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు అలవాట్లకు పాల్పడితే జీవితం నాశనమవుతుందన్నారు. ముఖ్యంగా ధూమపానం, మద్యపానంతోపాటు గంజాయి వాడకం వంటివి చేసి పట్టుబడితే జీవితంలో ఉద్యోగం దొరికే ప్రసక్తే ఉండదన్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు మూర్తి ప్రసాద్, సంతోష్ కుమార్, డి.శ్రీనివాస్, కె శ్రీలత, కె.రామునాయుడు పాల్గొన్నారు.

## సీపీఎం మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ

ఎస్.రాయవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారమ్మపాలెంలో సీపీఎం 24వ జిల్లా మహాసభల గోడ పత్రికను శుక్రవారం సీపీఎం మండల కార్యదర్శి ఎం. సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలో జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం రాజేష్, మైలపల్లి మాధవ, శ్యామ్, రాము, అప్పారావు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

నక్కపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట ప్రధాన రహదారిపై వున్న గుంతలో వాహనం పడి ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. న్యాయంపూడి గ్రామానికి చెందిన ఎం.మధు శుక్రవారం రాత్రి బైక్‌పై రాజయ్యపేట నుంచి తన ఇంటికి వెళుతుండగా ప్రధాన రహదారిపై ఉన్న గుంతలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని నక్కపల్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. గుంతలు పూడ్చాలని పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని జనసేన పార్టీ నాయకుడు పిక్కి స్వామి ఆరోపించారు. వెంటనే యువకులు ఈ రహదారి గుంతను పూడ్చివేశారు.

## మద్యం విక్రయిస్తున్న మహిళపై కేసు

ఎస్.రాయవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు ప్రధాన రహదారి పక్కనే ఉన్న షాపులో శుక్రవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను పట్టుకున్నట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. నాలుగు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఇటీవల నక్కపల్లిలో హోం మంత్రి వంగలపూడి అనిత నిర్వహించిన ప్రజాదర్బార్‌లో సర్పంచ్ కర్రి సూరివేణి ఫిర్యాదు మేరకు ఆ గ్రామంలో షాపులన్నీ తనిఖీలు నిర్వహించగా, ఓ షాపులో నాలుగు మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని, మహిళపై కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు.



బీమా పథకం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యాన శాఖాధికారి తదితరులు

## మామిడి రైతులు పంటల బీమాలో చేరండి

▸▸ జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకర్

సబ్బవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు మామిడి తోటల బీమా పథకంలో చేరాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి జి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక అమృత ఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో పంటల బీమా పథకంపై మామిడి రైతులుకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులతో కలసి పంటల బీమా పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రతికూల మార్పులతో పంట నష్టం వల్ల కలిగే ఆర్థిక నష్టాల నుంచి రైతులను ఆదుకుంటుందన్నారు. ఈ పథకానికి 2024-25 రబీలో జిల్లాలో మామిడి పంటలకు అమలు చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని 15 జిల్లాలో ఈ పథకం అమలవుతుందన్నారు. మామిడి రైతులకు ఎకరాకు కనిష్ఠంగా రూ.33 వేలు, గరిష్ఠంగా రూ.45 వేలు పరిహారంగా లబ్ధి చేకూరుతుందని ఆయన చెప్పారు. ప్రీమియంగా ఎకరాకు రూ.1650 నుంచి రూ.2500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం స్థానిక ఉద్యానవన శాఖాధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారిణి కిరణ్మయి, అమృతఫల ఎఫ్‌పీసీ సీఈవో కేఎల్ మౌక్తిక, జిల్లా కోఆర్డినేటర్ వెంకటగణేశ్, మోహన్, రైతు ఉత్పత్తిదారుల కంపెనీల సీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మోటార్ వాహన చట్టం నిబంధనలను విధిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకట నారాయణ సూచించారు. స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంవీ యాక్టు, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలు, యాంటీ డ్రగ్స్ గురించి వివరించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టపరంగా నేరమన్నారు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అతి వేగంగా వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి పోరాదని, సైబర్ నేరాలపై జాగ్రత్తలు పాటించాలని సీఐ స్పష్టం చేశారు.

## గొర్లివానిపాలెంలో చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

సబ్బవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం శివారు గొర్లివానిపాలెం గ్రామంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప, సరస్వతి, నాగబంధ, పసిడికళస విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం పురస్కరించుకుని శుక్రవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ముందుగా వేదపారయణం, విఘ్నేశ్వర పూజ, పంచగవ్య ప్రాశన, ప్రతిష్ఠా సంకళనం, గర్తన్యాసం, రత్నన్యాసం, యంత్రస్థాపన కార్యక్రమాలతో పాటు పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చింనాయుడు దంపతులు, గ్రామ పెద్దలు గండి దేముడు, బాదిరెడ్డి లక్ష్మణ, శ్రీమూర్తులు, శివ, నీలేశ్వరరావు, పలువురు మహిళలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సారవంతమైన నేలతో బహుళ ప్రయోజనాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో రంగాచారి

తుమ్మపాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సారవంతమైన నేలతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారి పి.రంగాచారి పేర్కొన్నారు. మార్టూరులో శుక్రవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సారవంతమైన నేలలో 15 రకాల పోషకాలతో కూడిన పంటలు పండుతాయన్నారు. పురుగుల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మా ఏటీఎం రామకృష్ణ పాల్గొన్నారు.

## వాహనాల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

▸▸ మూడు వాహనాలు స్వాధీనం: డీఎస్పీ శ్రావణి



నిందితుణ్ని అరెస్టు చేసి విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన నిందితుణ్ని శుక్రవారం అరెస్టు చేసి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ విజయనగరం జిల్లా వేపాడ మండలం సోంపురం గ్రామానికి చెందిన గుమ్మడి సురేష్ ఎలియాస్ బండ సురేశ్ అనకాపల్లి, దేవరాపల్లి ప్రాంతాల్లో మూడు వాహనాల చోరీకి పాల్పడ్డారన్నారు. అనకాపల్లిలో రెండు, దేవరాపల్లిలో ఒక ద్విచక్ర వాహనం చోరీ చేశాడన్నారు. నిందితుడు సురేశ్ చోడవరం రోడ్డులో నుంచి అనకాపల్లి వైపు వస్తుండగా ఏలేరు కాలువ వద్ద పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు, సిబ్బందితో అరెస్టు చేసి చోరీకి గురైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ నిందితుడు ద్విచక్ర వాహనాల దొంగతనాలతో పాటు వాహనాల డిక్కీల్లో నేరాలు చేస్తాడని, అతనిపై స్నాచింగ్ కేసులు కూడా ఉన్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లా బోదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా చోరీ కేసులు ఉన్నాయన్నాని ఆమె వివరించారు. నిందితుణ్ని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ విజయ్ కుమార్, ఎస్ఐలు ఎ.వెంకటేశ్వరరావు, డి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

# తాగునీరు వృథా.. ప్రజల వ్యథ!

**పైపులైన్‌కు రంధ్రం.. పట్టని అధికార గణం**

**పది నెలలుగా వృథాగా పోతున్న రక్షిత నీరు**

**'ఎదుటి వారికి చెప్పేటందుకె నీతులు ఉన్నాయి..' ఓ సినీ రచయిత రాసిన ఈ గేయం ఇక్కడ అధికారులకు అచ్చు గుద్దినట్టు సరిపోతుంది. తాగునీటిని ఒడిసి పట్టుకుందాం.. వృథాను అరికడదాం.. అని విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించే సదరు అధికారులు, తమ కళ్లెదుటే పైపులైన్‌కు రంధ్రం పడి వృథాగా నీరు పోతున్నా పట్టించుకునే పాపానికి పోవడం లేదు. ఒక రోజు.. నెల రోజులో కాదు! దాదాపు పది నెలలుగా ఇలా జరుగుతున్నా, పోయేది మనది కాదుకదా!? అనే నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తున్నారు.**



రహదారిపై ఏరులై పారుతున్న తాగునీరు



పైపునకు రంధ్రం ఏర్పడడంతో పైకి పోతున్న నీరు

పరవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్‌లో తాగునీటి సరఫరా చేసే పైపులైన్‌కు మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ వద్ద రంధ్రం ఏర్పడటంతో నీరు వృథా అవుతోంది. ఏలేరు కాలువ నుంచి తాడి వద్ద గల ఏపీఐఐసీ పంప్‌హౌస్ ద్వారా సెజ్‌కు నీటి సరఫరా జరుగుతోంది. అయితే పది నెలల క్రితం మండల పరిషత్ జంక్షన్ సమీపంలో భూమి అడుగుభాగాల పైపులైన్‌కు రంధ్రం ఏర్పడడంతో పెద్ద ఎత్తున నీరు వృథా అవుతోంది. ప్రధాన రహదారి మీదుగా నీరు పారుతూ సమీపంలోని గెడ్డలోకి చేరుతోంది. ఇప్పటికే ఫార్మాసిటీ, సెజ్‌లోని పరిశ్రమలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఇక్కడ పెద్ద ఎత్తున నీరు వృథా అవడం ఏపీఐఐసీ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. వీరి తీరు పట్ల స్థానిక ప్రజలు మండి పడుతున్నారు. పది నెలలుగా నీరు వృథాగా పోతున్నా పట్టించుకోకుండా నిద్ర మత్తులో ఉన్నారా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మేల్కొని తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయడంతో పాటు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.





భీమునిగుమ్మంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీలా గోవింద్... సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు

# వాడవాడలా అంబేడ్కర్‌కు ఘన నివాళులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శుక్రవారం వాడవాడలా అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనకాపల్లి పట్టణంలోని భీమునిగుమ్మం వద్ద ఆది ఆంధ్రా సంఘం, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేశ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి జరిగింది. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన కోరారు. పీటీడీ డిపో ఆవరణలో జై భీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ వై.రవిచంద్ర, జైభీమ్ అసోసియేషన్ డిపో సెక్రటరీ ఏటీ రాజు, ఎఫ్ఎంలు పాల్గొన్నారు. రింగురోడ్డులోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి మలసాల కుమార్‌రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు, సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ అల్లు వరబాబు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





కశింకోటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు... సబ్బవరంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద కలాసీల నినాదాలు

### కశింకోటలో...

కశింకోట: మండల కేంద్రంలో అంబేడ్కర్ 68వ వర్ధంతి నిర్వహించారు. ఐద్వా, సీఐటీయూ నాయకులు వరలక్ష్మి, డి.శ్రీనివాసరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత సామాజిక రాజకీయ హక్కుల కోసం అంబేడ్కర్ విశేషంగా కృషి చేశారని వారు తెలిపారు. ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

### తుమ్మపాలలో...

తుమ్మపాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి పేర్కొన్నారు. మామిడిపాలెంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఎం హెచ్‌బీ శ్రీధర్‌తో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చినబ్బాయి మాట్లాడుతూ కుల, మత, లింగ ప్రాంతీయ బేధాలు లేకుండా అందరూ భారతీయులే అనే స్ఫూహతో జీవించాలని సూచించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, వసంతరావు, సుబ్రహ్మణ్యం, చినబ్బాయి, శ్రీను, స్వామి తదితరులు పాల్గొన్నారు.

### కొత్తూరులో...

కొత్తూరు: రింగు రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను, ఉద్యమాలను వివరించారు.

### సబ్బవరంలో...

సబ్బవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతికి అందించిన సేవలు మరువరానివని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు పేర్కొన్నారు. వర్సిటీలో శుక్రవారం డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు పాల్గొన్నారు. అలాగే కలాసీ సంఘం కార్యాలయం సీపీఎం నేత ఉప్పాడ సత్యవతి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### పరవాడలో...

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఇంటక్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఇంటక్ వర్కింగ్ ప్రతినిధులు లెనిన్, బి.భీమరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలని వారు పిలుపునిచ్చారు. ఇంటక్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# రహదారి నిర్మించాలని ప్రజా సంఘాల నిరసన

కొత్తూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీలో ఉన్న సత్యనారాయణపురం, మూలపేట ప్రధాన రహదారిని యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం చేపట్టాలని జిల్లా ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మేరకు శుక్రవారం పూర్తిగా మరమ్మతులకు గురైన ప్రధాన రోడ్డుపై వారు బైఠాయించిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు చిన్నియాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సూదికొండ మాణిక్యాలరావు తదితరులు మాట్లాడారు. ఏళ్ల తరబడి సత్యనారాయణపురం, మూలపేట రోడ్డు మరమ్మతుకు నోచుకోకపోవడానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమని వాపోయారు. వైసీపీ హయాంలో అభివృద్ధికి నోచుకోలేదని, కూటమి ప్రభుత్వంలోనైనా ఈ రోడ్డు అభివృద్ధి చెందుతుందని స్థానికులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఈ మార్గం మీదుగా రాకపోకలు చేపడుతున్న వాహన చోదకులు, పాదచారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే కూటమి నేతలు ఈ రోడ్డును నిర్మించి ప్రజలకు సుగమమైన మార్గాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నేత ఆడారి బుచ్చిరాము, పలు ప్రజా సంఘాల నేతలు బొబ్బిలి గోవిందరాజు, ముగడా అప్పారావు, పల్లా సత్యఅప్పారావు, కె.సత్యారావు, ఎస్.అమ్మతల్లి పాల్గొన్నారు.



సత్యనారాయణపురం వెళ్ళే ప్రధాన రోడ్డుపై బైఠాయించిన ప్రజా సంఘాల నేతలు

## చెరువులవేనం వ్యూపాయింట్ కాలిబాట సైతం మూసివేత


చింతపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆంధ్ర కశ్మీర్‌గా ప్రసిద్ధి చెందిన లంబసింగికి సమీపంలో వున్న చెరువులవేనం వ్యూపాయింట్‌కి వెళ్లే కాలిబాటను కూడా శనివారం నుంచి మూసివేస్తున్నట్టు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. వర్షాలు కురుస్తుండడంతో చెరువులవేనం వ్యూపాయింట్‌కి వెళ్లే రహదారిపై కొండచరియలు విరిగిపడుతుండడంతో రెండు రోజుల క్రితం ఈ మార్గాన్ని మూసివేశామన్నారు. అయితే పర్యాటకులు లంబసింగి గ్రామం నుంచి కాలిబాట మార్గంలో వ్యూపాయింట్‌కి వెళుతున్నారని, ఈ దారిలో కూడా కొండచరియలు విరిగి పడే ప్రమాదం వుందన్నారు. ఈ కారణంగా నడక మార్గాన్ని కూడా మూసివేస్తున్నామన్నారు. పర్యాటకులు వ్యూపాయింట్‌కి వెళ్లకుండ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, పర్యాటకులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.



చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు

## ముగిసిన ఇంటర్ స్కూల్ బాస్కెట్‌బాల్ టోర్నీ



ట్రోఫీ, నగదు బహుమతిని అందిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ, సీఐ రమణ... (ఇన్‌సెట్‌లో) ఫైనల్స్‌లో తలపడుతున్న ప్రతిభ, అలాయిస్ జట్లు

సబ్బవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రతిభ విద్యాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఇంటర్ స్కూల్ బాస్కెట్‌బాల్ ప్రతిభ కప్ పోటీలు గురువారం రాత్రితో ముగిశాయి. ఫైనల్‌లో స్థానిక ప్రతిభ టీం, విశాఖ సెంట్ అలాయిస్ టీం హోరాహోరీగా తలపడ్డాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 16 టీంలు పాల్గొనగా, ఫైనల్స్‌లో ప్రతిభ విద్యాలయం టీం ప్రథమ స్థానం, సెంట్ ఆలాయిస్ టీం ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ బిచిన్నికృష్ణ, సీఐ పిన్నింటి రమణ క్రీడాకారులను అభినందించారు. విజేత టీంకు ట్రోఫీలతో పాటు రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జి.భూషణరావు, స్కూల్ కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, డైరెక్టర్లు శరత్‌తేజ, శ్రీవిష్ణుతేజ, హెచ్ఎం కె.కనకమహలక్ష్మి, పలు పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

▸▸ జాయింట్ కలెక్టర్ జాహ్నవి

అనకాపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి సూచించారు. మండలంలోని కోడూరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న సదస్సు తీరు తెన్నులను ఆమె పరిశీలించారు. అనంతరం అర్జీదారులతో నేరుగా మాట్లాడి సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే రెవెన్యూ సదస్సులతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరూ రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. ఈ సదస్సులో ఆర్డీవో షేక్ ఆయిషా, వీఆర్వో నాగరాజు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

▸▸ జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ

అనకాపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జీవిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టెక్‌ఫెస్ట్ పోటీల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

అనకాపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రీజనల్ పాలిటెక్నిక్ 'టెక్ ఫెస్ట్-2024'లో రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కంప్యూటర్, ఎలక్ట్రానిక్ విభాగం విద్యార్థులు జిల్లా స్థాయిలో ఎనిమిది, పదో స్థానంలో నిలిచారు. కంప్యూటర్ విభాగంలో ఐవోటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ ప్రాజెక్ట్ ఇన్ కంప్యూటర్స్ అనే ప్రాజెక్టు రూపొందించి టెక్ ఫెస్ట్‌లో కంప్యూటర్ రెండో సంవత్సరం చదువుతున్న థామస్, జాన్, శరవణభవ అద్భుత ప్రదర్శన చేసి ఎనిమిదో బహుమతి సాధించారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో స్మార్ట్ పార్కింగ్ అనేది ఆర్డునో ఆధారిత ప్రాజెక్టు రూపొందించి ఇదే విభాగంలో రెండో సంవత్సరం చదువుతున్న జి.దివ్య, కె.శ్రీదేవి, వసుధ, డి.భవ్యశ్రీ పదో బహుమతి దక్కించుకున్నారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు డ్రోన్ కెమెరాల వినియోగం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పోలీస్ శాఖ శుక్రవారం డ్రోన్ కెమెరాలతో పలు ప్రదేశాలను చిత్రీకరించింది. వివిధ కూడళ్లల్లో డ్రోన్ కెమెరాతో ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ రెగ్యులేట్ చేయడం జరిగిందని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. అదేవిధంగా డ్రోన్ కెమెరా సాయంతో ట్రాఫిక్‌ను ఏ విధంగా క్రమబద్ధీకరించాలన్నది అవగాహన చేసుకున్నట్టు చెప్పారు. కశింకోట జాతీయ రహదారిలో కూడా బ్లాక్‌స్పాట్‌ల వద్ద డ్రోన్ కెమెరా సహాయంతో పర్యవేక్షించినట్టు చెప్పారు.

## 9న అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

పరవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఈ నెల 9న అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు సమీక్ష ప్రారంభమవుతుందని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

## కనకదుర్గమ్మకు బంగారం వితరణ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం నతకంపట్టులో కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం గవరపాలెం ప్రాంతానికి చెందిన సూరిశెట్టి గణేశ్, శ్యామల దంపతులు అమ్మవారికి పావు తులం బంగారాన్ని వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు పాల్గొన్నారు.

## ట్యాంకర్ డ్రైవర్ అరెస్టు

సబ్బవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ట్యాంకర్‌తో ఢీకొట్టి ఓ వ్యక్తి మృతికి కారకుడైన డ్రైవర్‌ను స్థానిక పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నవంబరు 11న చిన్నయ్యపాలెం వద్ద బైక్‌పై వెళుతున్న మానేపల్లి సింహాద్రి అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్ పరమ్‌జీత్ సింగ్(35)గా గుర్తించారు. అతడు తన ట్యాంకర్‌ను ఒడిశాలోని బాలసోర్ వద్ద వదిలి పెట్టి పరారయ్యాడు. అతడిని శుక్రవారం విశాఖలో పోలీసులు పట్టుకొని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ రమణ తెలిపారు.

## జెడ్పీ నిధులతో తాగునీటి బోర్లు నిర్మాణం



భూమి పూజ చేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు

చింత పల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మంగి పంచాయతీ రారింతాడ గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి జడ్పీ నిధులతో బోరు ఏర్పాటు చేయనున్నట్టు స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తెలిపారు. శుక్రవారం చేతిపంపు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 15 చేతిపంపులు మంజూరయ్యాయన్నారు. పది రోజులు అవసరమైన గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో వైస్ సరపంచ్ కే సత్యనారాయణ, మాజీ వైస్ సర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యుడు చల్లంగి మరియమ్మ, గ్రామపెద్దలు పాంగి గణబాబు, చిలకమ్మ పాల్గొన్నారు.

## పీటీఎం సమావేశాలకు ఏర్పాట్లు



డౌనూరు ఆశ్రమ పాఠశాలలో ఏర్పాట్లు

కొయ్యూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం నిర్వహించనున్న పేరెంట్స్ కమిటీ (పీటీఏ) సమావేశాలకు అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు చేశామని ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ఎంఈవో రాంబాబు తెలిపారు. ఈ మేరకు మండలంలో గల 17 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలతో పాటు గురుకుల పాఠశాల, కస్తూర్బా విద్యాలయం, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు ఎంపీ ఎలిమెంటరీ, జీపీఎస్ పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈ సమావేశాలను నిర్వహిస్తామన్నారు.

**చింతపల్లిలో...**

చింతపల్లి: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో మెగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించనున్నట్టు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. శుక్రవారం చౌడుపల్లి ఎంపీయూపీ, చింతపల్లి బాలికలు, బాలూర, లంబసింగి బాలుర, వంగసార బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు కుడుమల కాంతారావు, సాగిన రామరాజుపడాల్, జేపీ కొండలరావు, వీరభద్రరావు, ప్రసాదరావు ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశానికి తల్లిదండ్రులు విధిగా హాజరుకావాలని వారు కోరారు.

## సైనికులకు కలెక్టర్ సాయుధ పతాక శుభాకాంక్షలు

పాడేరురూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక దినోత్సవం ఈ నెల 7వ తేదీన జరుపుకోనున్న సందర్భంగా కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ సైనికులకు హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి నేటి వరకు సాయుధ దళాలు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, దేశ రక్షణకు వారు ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. దేశ రక్షణలోప్రాణాలు కోల్పోయిన వీర జవాన్లపై ఆధారపడిన వారి సంక్షేమం కోసం, మాజీ సైనికులు, వృద్ధ మాజీ సైనికులు, వితంతువుల సంక్షేమం కోసం ఈ నెల 7న పతాక దినోత్సవం రోజు సాయమందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ ఈ సాయం వీర జవాన్‌ల కుటుంబ సంక్షేమానికి, మాజీ సైనికుల సంక్షేమానికి, వారి పురావాసానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విరాళాలు సంచాలకులు, సైనిక సంక్షేమశాఖ, మొగళరాజపురం, విజయవాడ (ఆంధ్రప్రదేశ్) వారికి డీడీ, ఈసీఎస్ ద్వారా గాని ఎస్‌బీఐ ఎంజీ రోడ్, విజయవాడ బ్యాంక్ అకౌంట్ 338811 28795, ఐఎఫ్ఎస్‌జీ-ఎస్‌బీఐఎన్0016857కు పంపించాలన్నారు.

## ఆర్థికంగా ఎదిగేందుకు ఎంఎస్ఎంఈ దోహదం



అనంతగిరిలో వ్యాపారుల వివరాలను నమోదుచేస్తున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎమ్ఈ (సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల)ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉందని ఎంపీడీవో ఏవీవీ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సచివాలయం సిబ్బంది కలిసితో కలిసి శుక్రవారంవ్యాపారులకు వద్దకు వెళ్లి సర్వే నిర్వహించారు. వ్యాపారులకు ప్రభుత్వం నుంచి ఏమైనా అందిందా.. బ్యాంకు రుణాల వ్యాపారులు చేస్తున్నారా తదితర వివరాలు తెలుసుకుని ఎంఎస్ఎమ్ఈ యాప్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలోని కార్యదర్శి దేవా, సచివాలయం సిబ్బంది సంధ్య, రవి, దీపిక, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



శోభ అంజలి కుటుంబానికి రూ.5లక్షల చెక్ అందిస్తున్న మంత్రి మనోహర్



గిరిజనుల సమస్యలు వింటున్న మంత్రి

# గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్
- జనసేన నేత శోభ అంజలి కుటుంబానికి పరిహారం అందజేత

హుకుంపేట డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నేత శోభ అంజలి దొర ఆశయాలకు అనుగుణంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నా దెండ్ల మనోహర్ తెలిపారు శుక్రవారం మంత్రి జిల్లా పర్యటనలో భాగంలో కొట్నాపలి వచ్చారు. ఆయనకు పార్టీ నేతలు డ్వాక్రా మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఇటీవల మృతి చెందిన మండంలోని రాప పంచాయతీ తంపుపడపరాయి గ్రామానికి ఇటీవల మృతి చెందిన శోభ అంజలి దొర కు టుంబాన్ని పరామర్శించారు. తల్లిదండ్రులు శోభ చిన్నయ్య వరలమ్మలకు రూ. 5 లక్షల చెక్ చెక్కు అందించారు. ఈ సందర్భంగా జీవో 3 సమస్య పరిష్కరించాలని ఉపాధ్యాయులు వినతి పత్రమందించారు. దీనిపై మంత్రి సానుకులంగా స్పందించారు. కోట్నాపల్లి నల్ల రాయి క్వారీ వద్ద తాగునీటి, రోడ్డు సమస్యలపై డ్వాక్రా మహిళలు వినతి అందించారు. మంత్రి సచివాలయం సందర్శించి సమస్యలపై సిబ్బందినుంచి ఆరా తీశారు. పలువురు పించన్లు, రేషన్‌కార్డులలేవని ఫిర్యాదు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జనసేన పార్టీ నేతలకు ఎటువంటి సమస్యలు వచ్చినా అండగా నిలుస్తామన్నారు. అంజలిని ఆశయాలకు అనుగుణంగా పంచాయతీల్లో రోడ్లు, నీటి పథకాలు, డ్రైనేజీలు అభివృద్ధి చేస్తామన్నారు. డ్వాక్రా మహిళలు గ్యాస్ సబ్సిడీ తమ ఖాతాలో పడుతుందని తెలిపారు. వీవోఏలు, జీవో 3 సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సైనికులు, తహసీల్దార్ విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణారావు, ఏపీఎం అచ్చయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు. మంత్రిపర్యటన నేపథ్యంలో స్థానిక సీఐ నాయుడు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



:సీలేరులో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెన్‌కో ఇంజనీర్లు, ఉద్యోగులు



చింతపల్లిలో నివాళులర్పిస్తున్న జడ్పీటీసీ బాలయ్య, ఎంపీడీవో తదితరులు

పాడేరురూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత ఆశయ సాధనకు కృషి చేయాలని వక్తలు అన్నారు. అంబేడ్కర్ 68వ వర్ధంతిని వాడవాడలా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్. వనుము చిట్టిబ్బాయి మాట్లాడారు.అధ్యాపకులు పి.కోటేశ్వరరావు, జి.భాస్కరరావు, వి.రమేష్ బాబు, జి.గౌరీశంకరరావు, వి.శంకరరావు, అచ్యుత్, ఈవీ.జయలక్ష్మి పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు భీంనాయుడు, రామారావు, ప్రసాదరావు, కేశవ, కేశవరావు, రాజేష్, మహేశ్వరి పాల్గొన్నారు. పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏబీవీపీ నాయకులు నివాళులర్పించారు. బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్ ఆధ్వర్యంలో నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. చల్లా రామకృష్ణ, పాంగి రవిచంద్ర, కె.వెంకటరమణ, ఎల్.భాస్కర్ ఉన్నారు.

చింతపల్లి: అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆయన విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి పూలమాలవేసి నివాళి అర్పించారు.

**జి.మాడుగుల:** అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కె.రాంబాబు అంబేడ్కర్ సేవలను కొనియాడారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**సీలేరు:** జీకేవీధి మండలం సీలేరులో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోస్టాఫీసు సెంటర్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి జెన్‌కో ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మిక నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక డీఏవీ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ కిరణ్ , ఉపాధ్యాయులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెన్‌కో ఈఈ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ఎ అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, వివిధ పార్టీల నాయకులు మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు చంద్రశేఖర్, సూర్యనారాయణ, బాబూరావు, చిన్నిగున్నిపడాల్, కామేశ్వర రావు, రాజు, కృష్ణారావు, హరిచంద్ర పాల్గొన్నారు.



జి. మాడుగులలో నివాళులర్పిస్తున్న సర్పంచ్



ముంచంగిపుట్టులో..

## అల్లూరి జిల్లా సమగ్రాభివృద్ధికి రూ. 10 వేల కోట్లు కేటాయించాలి: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి అప్పలనర్స

పాడేరురూరల్, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): అల్లూరి జి ల్లా సమగ్రాభివృద్ధికి రూ. 10 వేల కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా నూతన కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. ఈ నెల 4, 5వ తేదీలో పాడేరులో నిర్వహించిన జిల్లా ప్రథమ మహాసభలు దిగ్విజయమైన సందర్భంగా శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో ని ర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా పరిపాలన, అభివృద్ధి, సంక్షే మం, గిరిజన హక్కులు, చట్టాలు అమలుకు జడ్పీ సమావేశం జిల్లా కేంద్రమైన పాడేరులో నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మహాసభల్లో 20 అంశాలను ఆమోదించామన్నారు. అల్లూరిజిల్లా ఆవిర్భవించి మూడేళ్లయినా, నేటికి ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడున్నాయోప్రజలకు తెలియని దుస్థితి ఉందన్నారు. గిరిజన గ్రామాల్లో డోలీ మోతల నియంత్రణకు రహదారి, రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థలను మెరుగుపర్చాలన్నారు. చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, ఆదివాసీ మాతృ భాష విద్యా వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అరకు,చింతపల్లి, ముంచంగిపుట్టు ఆస్పత్రులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా అ భివృద్ధి చేయాలన్నారు.ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఎల్.సుందరరావు, పాలికి లక్కు, వంతాల దాస్ పాల్గొన్నారు.

## మంత్రి మనోహర్‌కు సమస్యలపై వినతులు



మంత్రి మనోహర్‌కు వినతిపత్రమిస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం పాడేరు వచ్చిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు పలువురు సమస్యలపై వినతులందించారు. పీఎంఆర్సీ భవనం లో మంత్రిని కలిసి ఆదివాసీ ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ రామారావు దొర వినతి ఇచ్చారు. షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేసి ఆదివాసీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కె.తెల్లబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే, మంత్రి మనోహర్‌ను అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి తదితరులు కలిసి మెగా డీఎస్సీ ప్రకటించే ముందు జీవో 3 స్థానంలో షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం తేవాలన్నారు. గురుకుల పాఠశాలల్లోని ఆదివాసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బి.సింహాచలం, బి.రాంబాబు, ఎస్.కేశవరావు, బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సలీం, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు, జీఎస్‌యూ జిల్లా నాయకుడు బుడిదె మాధవరావు పాల్గొన్నారు. మన్యంలో అర్హులకు నూతన రేషన్ కార్డులు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు వినతిపత్రం అందించారు.

## జీపు బోల్తా

పెదబయలు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మారుమూల జామిగూడ సమీపాన శుక్రవారం ఓ ప్రైవేటు జీపు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.అరకులోయ నుంచి ప్రయాణికులతో చిత్రకొండ వెళ్లి తిరుగు ప్రయాణంలో వంతెన నిర్మాణం కోసం తాత్కాలికంగా నిర్మించిన అప్రోచ్ రోడ్డు వద్ద జీపు అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. డ్రైవర్ చాకచక్యంగా ముందుగానే జీప్ నుంచి దూకేయటంతో క్షేమంగా బయట పడ్డాడు. అనంతరం స్థానికులు ఘటన స్థలంలో వద్ద చేరుకొని ట్రాక్టర్ సహాయంతో జీపును బయటకు తీశారు.

## బాల సదనం చిన్నారులకు రగ్గులు, దుప్పట్లు వితరణ



రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేసిన హెల్త్ ట్రైబల్ హ్యూమన్ ప్రతినిధులు

పాడేరురూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాడేరు సమీపాన తలారిసింగిలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల సదనంలో ఉన్న 51 మంది చిన్నారులకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ హెల్త్ ట్రైబల్ హ్యూమన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గుమ్మ ధనలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం రగ్గులు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హ్యూమన్ అసోసియేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులకు చలి నుంచి రక్షణగా రగ్గులు, దుప్పట్లు అందించామన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ లోచలి పెద్దమ్మి, జిల్లా కో-ఆర్డినేటర్ నేరోడి మాయావతి, జిల్లా వైద్య కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రైజ్ ట్రైబ్స్ సర్వేతో సంక్షేమ పథకాలు

- టీడబ్ల్యూడీ ప్రొగ్రాం మేనేజర్ రాము



కించుమండలో సర్వే చేస్తున్న మేనేజర్ హరేరాము

దుంబ్రిగుడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన కుటుంబాలకు రైజ్ ట్రైబ్స్ యాప్‌తో సమగ్ర సర్వే చేసి వారి ఆదాయం పెంపునకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని టీడబ్ల్యూడీ ప్రొగ్రాం రాష్ట్ర మేనేజర్ హరేరాము తెలిపారు. మండలంలోని కించుమండ పంచాయతీ కేంద్రంలో గిరిజన కుటుంబాల సమగ్ర సమాచారాన్ని సేకరించారు. ఇంటింటికీ వెళ్లి అధికారులతో సర్వే చేపట్టారు. అల్లూరి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు గ్రామాలుగా కించుమండ, పెదలబుడు గ్రామాల్లో ఎంపిక చేసినట్టు ఈ సందర్భంగా ఆయన వివరించారు. రైజ్‌ట్రైబ్స్ యాప్ ప్రత్యేక వివరాలను సేకరించి గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలు, ఆదాయం పెంపునకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తున్నారు. ఈ యాప్‌తో రాష్ట్రమంతటా సర్వే చేపట్టి సమగ్ర సమాచారాన్ని సేకరించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పాడిలో టీడీపీ సభ్యత్వ నమోదు

దుంబ్రిగుడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కితలంగి పంచాయతీ పాడి గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోల్లోరి ప్రసాద్ ఇంటింటికి వెళ్లి గిరిజన కుటుంబాలతో సభ్యత్వ నమోదు నిర్వహించారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పార్టీ కట్టుబడి పని చేస్తోందని ఈసందర్భంగా ఆయన తెలిపారు. కార్యకర్తలకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు పోతురాజు, మాజీ ఉప సర్పంచ్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## మన్యంలో వెంకన్న ఆలయం నిర్మించాలి

- టీటీడీ అదనపు ఈవోకు జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్ వినతి



టీటీడీ అదనపు ఈవోతో మాట్లాడుతున్న జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మన్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు ఈవో వెంకయ్యచౌదరిని కోరినట్టు జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం టీటీడీ అదనపు ఈవోను కలిసి మన్యానికి సంబంధించి పలు అంశాలపై వినతిపత్రం ఇచ్చినట్టు ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో ఏజెన్సీలో వెంకన్న ఆలయాన్ని, పలు చోట్ల కల్యాణ మండపాలను నిర్మించాలని, టీటీడీకి చెందిన విభాగాల్లో గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, గిరిజన కాఫీని ప్రమోట్ చేయడంతో కాఫీ స్టాల్‌ను ఏర్పాటు చేయాలని ఆయనను కోరినట్టు శ్రావణ్‌కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాండురంగస్వామి, బాకూరు వెంకటరమణ, సాగర సుబ్బారావు, శ్రీనివాసచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారికీ విద్యా హక్కు



విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్

అరకులోయ, డిసెంబరు 6 (ఆంధ్రజోతి): ప్రతి బిడ్డకు చదువు అనేది హక్కు అని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.భరత్‌కుమార్ అన్నారు. డిగ్రీ కళాశాలలో గర్ల్స్ చైల్డ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2009 విద్యాహక్కు చట్టం ప్ర కారం.. విద్యను పొందడం ప్రతి బిడ్డకు హక్కుగా దఖలు పడిందన్నారు. బాలికలకు చదువుతో సమాజభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు వై.విజయలక్ష్మి, ఎం.అనిత, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు 200 పని దినాలు కల్పించాలి: సీఐటీయూ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

చింతపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం వంతమామిడి గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన సమావేశమయ్యారు. సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పించాలని చట్టంలో ఉన్నా అమలు కావడంలేదన్నారు. కేవలం 100రోజులు మాత్రమే పని కల్పిస్తుండడంతో కూలీలు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కూలీలు పని చేసే ప్రాంతంలో వైద్య సహాయక చర్యలు అందించేందుకు చర్యలు తీసుకోవలన్నారు.పనిచేసిన 15రోజుల్లోనే వేతనాలు చెల్లించాలన్నారు. ఈకార్యక్రమంలో పెద్దబాలయ్యపడాల్, అప్పలనాయుడు, పండుపడాల్, జి. సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.


## కుట్టు శిక్షణ ఇచ్చారు సరే... మరి మిషన్లు ఏవీ..?



శిక్షణకు ఇచ్చి సర్టిఫికెట్లు చూపుతున్న మహిళలు

సీలేరు, డిసెంబరు 6 , (ఆంధ్రజ్యోతి):గిరిజన యువ ప్రగతి సంస్థ వారు గిరిజన మహిళలు రూ. 3 వేలు చెల్లిస్తే టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి కట్టుమిషన్‌లు ఉచితంగా ఇస్తామని ప్రకటించి మోసం చేసిందని గిరిజన సంఘం మండల నాయకుడు బాకూరి కోటేశ్వరరావు ఆరోపించారు.జీకేవీధి మండలం ధారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల మూడు పంచాయతీల్లో గిరిజన యువ ప్రగతి సంస్థ 2020 లో ధారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల పంచాయతీల్లో సుమారు 95 మంది గిరిజన మహళలతో రూ. 3వేలు కట్టించుకుని మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు మాత్రమే ఇచ్చారని అన్నారు. నేటికి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు కుట్టుమిషన్లు ఇవ్వలేదని, సంస్థ ప్రతినిధులను అడిగితే రేపుమాపు ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.ఇకనైనా కట్టుమిషన్లు సరఫరా చేయాలని కోటేశ్వరావుడిమాండ్ చేశారు.అలాగే, శిక్షణ పొందినమహిళలకుగౌరవ వేతనమందించాలన్నారు.

## హైందవ ధర్మ ప్రాధాన్యంపై చైతన్యం అవసరం



ర్యాలీ చేస్తున్న హైందవ పెద్దలు, గిరిజనులు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైం దవ ధర్మ ప్రాముఖ్యతపై ప్రజలు చైతన్యవంతులు కావాలని ఆర్ఎస్ఎస్ కండ ఇన్‌చార్జి గెమ్మెలి మోహనరావు అన్నారు. శుక్రవారం మండలంలోని లక్కవరపుపేట గ్రామ పంచాయతీ కేంద్రంలో హైందవ శంఖారావం సమావేశం జరిగింది. తొలుత ర్యాలీ చేపట్టారు.అనంతరం మోహనరావు మాట్లాడుతూ హిందూ ధర్మం గొప్పతనాన్ని ప్రతి ఒకరు తెలుసుకోవాలన్నారు. అలాగే, జనవరి 5వ తేదీన విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం మహాసభకు సనాతన ధర్మ పెద్దలు, గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఈ కార్య క్రమంలో బాలవికాస్ జిల్లా కన్వీనర్ కోషూరు లక్ష్మణరావు, విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయక కార్యదర్శి సదా వెంకటరమణ, వీరస్వామి, చిన్నబ్బాయి, మల్లిబాబు పాల్గొన్నారు.

## తాజంగి పంచాయతీలో స్వచ్ఛభారత్



తాజంగి జలాశయం వద్ద చెత్తను తొలగిస్తున్న ఉద్యోగులు, స్థానిక యువత

చింతపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి పంచాయతీ కేంద్రంలో శు క్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు, పర్యాటక వికాస్ ప్రతినిధులు, గ్రామ యువత కలిసి పలు వీధుల్లో చెత్తను తొలగించారు. తాజంగి జలాశయం పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోనూ ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీవాసరావు, ఉద్యోగులు పరిసరాలను శుభ్రం చేశారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్, పర్యాటక వికాస్ చైర్మన్ చెట్టి శంకర్ పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్

» 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు గడువు

» 26న రాత పరీక్ష, 27న ఇంటర్వ్యూలు



నోటిఫికేషన్ ప్రదర్శిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం డివిజన్ పరిధిలో కొత్తగా 14 చౌక ధరల దుకాణాలతో పాటు ఖాళీలు ఏర్పడ్డ 37 డీలర్ల నియామకానికి ఆర్డీవో వీవీ రమణ నోటిఫికేషన్ ప్రదర్శించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో సూర్యనారాయణతో కలిసి డీలర్ల నియామక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 18 నుంచి 40 ఏళ్ల లోపు ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఇందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రింట్ తీసుకుని సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాపీలు అందజేయాలని సూచించారు. ఈ నెల 26న రాత పరీక్ష, 27న మౌఖిక పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రాత పరీక్ష, మౌఖిక పరీక్ష జరిగే స్థలాల వివరాలను అభ్యర్థుల హాల్ టిక్కెట్లలో వెల్లడిస్తామని చెప్పారు.

# జోగంపేటలో లేగదూడల ప్రదర్శన



లేగదూడల ప్రదర్శనలో దూడలను పరిశీలిస్తున్న ఏడీఏ రాంబాబు

గొలుగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగంపేట జంక్షన్‌లో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ ఏడీ రాంబాబు పాల్గొని లేగదూడల పెంపకం, పాల దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. పాడి పశువులను సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా పశువుల శాలల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. 4-8 నెలల లేగదూడలకు బ్రూసెలెస్ వ్యాక్సిన్ వేయాలని చెప్పారు. దూడ పుట్టిన అర గంటలోనే ముర్రు పాలు పట్టించాలన్నారు. అనంతరం మొదటి, రెండో స్థానాల్లో నిలిచిన లేగదూడలకు సంబంధించిన రైతులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పశు వైద్యులు రమేశ్, శిరీషా, పుష్ప, హరిత, సౌజన్య, స్థానిక నాయకులు కె.అప్పారావు, ఆర్.జమీలు, బి.సూర్యనానారయణ, ఆనంద్ పాల్గొన్నారు.

## రబీ పంటలకు బీమా చేయించుకోండి

రోలుగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీలో పండించే పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి కోరారు. రబీ క్రాప్ ఇన్సూరెన్సు ప్రారంభమైందని, వరి, మినుము, పెసర పంటలకు బీమాకు వీలుందన్నారు. మినుములు, పెసలు పంటలకు ఒక ఎకరాకి రూ.300 చెల్లిస్తే రూ.20 వేల వరకు బీమా వర్తిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు ఆధార్‌కార్డు, భూమి రికార్డులు, బ్యాంకు ఖాతాలతో రైతు సేవా కేంద్రాలు లేదా మీసేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

## 8 విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు

చోడవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం, చోడవరం, పాడేరులలో ఈ నెల 8 నుంచి 10 వరకు విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పఠన పోటీలు నిర్వహిస్తున్నట్టు హిందూ ధర్మప్రచార పరిషత్ కోఆర్డినేటర్ సిహెచ్.సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 8న విశాఖ ఎంవీపీ కాలనీలోని హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యాలయం, చోడవరంలోని ప్రేమసమాజం ఆవరణ, 10న పాడేరు టీవీకే స్కూల్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

# రెవెన్యూ సభలతో భూ సమస్యల పరిష్కారం

» నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ





గొలుగొండ: కొత్తమల్లంపేటలో సభలో వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో... నాతవరం: సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

గొలుగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభల ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్డీవో వీవీ.రమణ తెలిపారు. మండలంలోని కొత్తమల్లంపేట గ్రామంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో 12 సమస్యలపై రైతులు అందించిన వినతులను ఆర్డీవో స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్‌వోలు పడాల్, అప్పారావు, మాజీ సర్పంచ్ చిటికలె సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండలంలోని పైడిపాల, లచ్చన్నపాలెం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదసుల్లో జిల్లా పశు వైద్యాధికారి, మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు ఉంటే ఈ సదస్సుల ద్వారా పరిష్కంచుకోవాలని రైతులకు సూచించారు. భూముల వివరాలు అన్‌లైన్ కాకపోయినా, 1బీ, అడంగల్ రాకపోయినా, భూ సర్వే జరగపోయినా సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన చెప్పారు. వీటిని పరిశీలించి 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. రెండు గ్రామాల్లో రైతుల నుంచి 70 వినతులు వచ్చినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్, ఆర్‌ఐ జట్టి, వీఆర్‌వోలు రమణ, సూరిబాబు, టీడీపీ సీనియర్ నేత సిద్దాబత్తులు శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

## నాతవరంలో...

నాతవరం: మండలంలోని ములగపూడి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ప్రభుత్వ స్థలాలు, చెరువులు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ కోరారు. వాటిని స్వాధీనం చేసుకుని గ్రామంలోని పేదలకు పంపిణీ చేయాలని ఆయన విన్నవించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు లాలం వెంకటరణ కోరారు. 11 అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగశిరీషా, ఎంపీపీ సాగిన లక్ష్మణరావు, టీడీపీ గ్రామ ఇన్‌చార్జి పెట్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# బలిఘట్టం సత్యనారాయణస్వామి ఆలయం అన్నవరం దేవస్థానానికి దత్తత



ఆలయ నిర్వహణ బాధ్యతలు అన్నవరం దేవస్థానం చైర్మన్‌కు అందిస్తున్న స్పీకర్

నర్సీపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం సత్యనారాయణస్వామి ఆలయాన్ని అన్నవరం దేవస్థానానికి దత్తత ఇచ్చారు. ఈ మేరకు బలిఘట్టం ఆలయ నిర్వహణ బాధ్యతలను అన్నవరం దేవస్థానం స్వీకరించింది. శుక్రవారం అన్నవరంలో బలిఘట్టం ఆలయ కార్యనిర్వహణ అధికారిని దివ్యతేజ దత్తత పత్రాలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయ ఈవో త్రినాథ్, చైర్మన్ రోహిత్‌కు అప్పగించారు.

అంతకు ముందు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులకు అన్నవరం ఆలయ అర్చకులు పూర్ణకుంభం వేదమంత్రాలతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ బలిఘట్టం ఆలయ నిర్వహణ బాధ్యతలు అన్నవరం దేవస్థానానికి అప్పగించనట్టు ప్రకటించారు. వారం రోజుల క్రితం బలిఘట్టం ఆలయం దత్తత తీసుకోవాలని అన్నవరం ఆలయ చైర్మన్ రోహిత్‌ను కోరానని తెలిపారు. దానికి ఆయన వెంటనే అంగీకారం తెలిపారన్నారు. సిబ్బంది జీతాలు, ఆలయ నిర్వహణ అన్నవరం దేవస్థానం బాధ్యత వహిస్తుందని ఆయన తెలిపారు. ఆలయాన్ని ఆనుకొని ఉన్న కళ్యాణ మండపాన్ని కూడా దత్తత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చింతకాయల విజయ్, రాజేశ్, మునిసిపాలిటీ టీడీపీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు అన్నవరం వెళ్లారు.

# డిజిటల్ ఎంట్రీ తర్వాత ఆన్‌లైన్‌లో సొసైటీలు

» రాష్ట్ర డిప్యూటీ రిజిస్ట్రార్ సత్యనారాయణరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ రిజిస్ట్రార్

గొలుగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ సహకార సొసైటీలను డిజిటల్ ఎంట్రీ చేసిన తర్వాత సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర డిప్యూటీ రిజిస్ట్రార్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సొసైటీలో రికార్డులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2037 సొసైటీల్లో ఇప్పటివరకూ 1980 సొసైటీలను డిజిటల్ ఎంట్రీ పూర్తి చేశామన్నారు. దీంతో వివిధ రుణాలు, సభ్యుల ఓటు హక్కుకు సంబంధించిన వివరాలు డిజిటల్ ఎంట్రీ చేస్తున్నామన్నారు. అనంతరం రైతుల వివరాలు ఆన్‌లైన్ చేసి రుణాలు మంజూరు చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో డీవీఎస్.వర్మ, డీజీఎం అశోక్‌కుమార్, నర్సీపట్నం బ్రాంచి మేనేజర్ నాయుడు, పీవీ.సత్యనారాయణ, సిబ్బంది రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అనుమానిత ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా



డ్రోన్ కెమెరాలతో తనీఖీలు చేస్తున్న ఎస్‌ఐ

కృష్ణాదేవిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనుమానుత ప్రాంతాల్లో పోలీసులు డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేస్తున్నామని కృష్ణాదేవిపేట ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ఏజెన్సీ ముఖద్వారం భీమవరం పోలీస్ చెక్‌పోస్టు, కృష్ణాదేవిపేట గ్రామంలో శుక్రవారం డ్రోన్ కెమెరాలతో తనిఖీలు చేపట్టి ఫొటోలు తీసి పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ డ్రోన్ కెమెరాతో వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్, గంజాయి, సారా తయారీ, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో డ్రోన్‌లతో తనిఖీలు చేస్తున్నామన్నారు. ఇకపై డ్రోన్ కెమెరాలతో గంజాయి సమాచారం ఉంటే తక్షణమే పట్టుకుంటామని చెప్పారు.

## వరి పంటకు నష్ట పరిహారం ఇప్పించరూ..

నాతవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో దెబ్బతిన్న వరి పంటకు నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. తుఫాన్ కారణంగా వీచిన ఈదురుగాలులకు మండలంలోని వరి పంట చాలా వరకు నేలకొరిగిందని, చేతి కందే సమయంలో వరి పంటను కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 600 ఎకరాలకు పైగా పంట నేలకొరిగి నీటిలో తేలియాడుతున్నదని రైతులు వాపోయారు. వ్యవసాయ అధికారులు పొలాల్లోకి వచ్చి వరి పంట నష్టాన్ని అంచనా వేయాలని, ప్రభుత్వానికి నివేదిక అందించి పరిహారం అందేలా చూడాలని వారు వేడుకుంటున్నారు.

## అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషిచేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాల సాధనకు యువతీ, యువకులు కృషి చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి కోరారు. కొత్త వీధి నుంచి పెదబొడ్డేపల్లికి వెళ్లే రోడ్డులో పెద్ద చెరువు వద్ద శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏకా శివప్రసాద్, మామిడి శ్రీను, తమరాన శ్రీను పాల్గొన్నారు.

**కృష్ణాదేవిపేట:** గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, గాదంపాలెం, చోద్యం తదితర గ్రామాల్లో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎల్‌పురం ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎస్‌ఐ వై.తారకేశ్వరావు, సర్పంచ్ లోచల సుజాత, పలు సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు, పలు దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**మాకవరపాలెం:** మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తామరం గ్రామంలోని దళిత వాడలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి తూర్పుకాపు సంఘం మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు పూలమాలలు వేసి నివాళలర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. మాకవరపాలెం, మల్లవరం, గిడుతూరు తదితర గ్రామాల్లో అంబడ్కేడర్ వర్ధంతి నిర్వహించారు.

## రేషన్ డిపోల భర్తీకి నోటిఫికేషన్ జారీ

రావికమతం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు రేషన్ డిపోలకు శాశ్వత డీలర్లు నియామానికి నర్సీపట్నం ఆర్డీవో నోటిఫికేషన్ జారీ చేసినట్టు స్థానిక తహసీల్దార్ బి.వెంకటరమణ తెలిపారు. మండలంలో కొత్తకోట గ్రామ సచివాలయ పరిధిలో డిపో నంబరు 4,6, జెడ్. జెన్నవరం పరిధిలో డిపో నంబరు17, మేడివాడలో 35 , మరుపాక లో డిపో నంబర్ 43 డిపోలకు ప్రస్తుతం తాత్కాలిక డీలర్లతో కొనసాగుతున్నాయన్నారు. దరఖాస్తులను నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అభ్యర్థులు ఈనెల 13లోగా అందించాలన్నారు. ఈనెల 26న రాత పరీక్షల ఉంటుందన్నారు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి ఈనెల 27న మౌఖిక పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

## మద్యంతో వ్యక్తి అరెస్టు

రావికమతం: మద్యం సీసాలతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొత్తకోట ఎస్‌ఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు.స్పెషల్ పోలీసులు అందించిన సమాచారం మేరకు తమ సిబ్బంది తనిఖీలు నిర్వహించగా కన్నంపేట వెళ్లే రహదారిలో ఆ గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద 20 మద్యం సీసాలను గుర్తించామన్నారు. ఆయనపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

## సరస్వతిదేవి విగ్రహావిష్కరణ



కుసర్లపూడిలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు తదితరులు

రోలుగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కుసర్లపూడి జడ్పీ పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహాన్ని శుక్రవారం సర్పంచ్ మద్దు అప్పలనాయుడు ఆవిష్కరించారు. ఈ విగ్రహన్ని సొంత ఖర్చులతో ఏర్పాటు చేసి హెచ్‌ఎం మోహన్‌రావు దంపతులను అభినందించారు. భవిష్యత్‌లో పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జగ్గారావు, గ్రామ నాయకులు నబ్బువరపు పెద్దినాయుడు, మాగిరెడ్డి రమణ, గొల్లు రాజుబాబు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

మాడుగుల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజేపురంలో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బీశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ నిధులు రూ4లక్షల తో రాపేటి వారి కళ్లాల వద్ద చేతి బోరు, గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు కేటాయింపుపై హర్షం

చోడవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బ్రాహ్మణుల సంక్షేమానికి ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ. 270. 61 బడ్జెట్ కేటాయిస్తూ సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడంపై ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఉమ్మడి జిల్లా మాజీ కో ఆర్డినేటర్ కొమ్మనమంచి నరసింహమూర్తి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత వైసీపీ ఐదేళ్లపాలనలో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడంతో బ్రాహ్మణులు ఎంతో నిరా దరణకు గురయ్యారన్నారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం చంద్రబాబు 2014లో ప్రత్యేకంగా ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, అనేక సంక్షేమ పథకాలతో ఆదుకున్నారన్నారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం వీటిని నిర్వీర్యం చేసిందన్నారు.పైగా బ్రాహ్మణులపై దాడులు దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ఈ స్థితిలో ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం బ్రాహ్మణ కార్పొరేషన్‌కు భారీ బడ్జెట్ కేటాయించడం ఆనందంగా ఉందన్నారు.


## 1 నుంచి లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి



సబ్ ట్రెజరీ అధికారి మూర్తి

చోడవరం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛనుదారులంతా తమ లైఫ్ సర్టిఫికెట్లను వచ్చే జనవరి 1 వ తేదీ నుంచి ఫిబ్రవరి నెలాఖరులోగా సమర్పించాలని తా లూకా సబ్ ట్రెజరీ అధికారి ఏ.బీ.ఎస్. ఎస్. ఎన్. మూర్తి శుక్రవారం తెలిపారు. గతంలో డిసెంబరులో ఈ సర్టిఫికెట్లు సమర్పించేవారని, అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్పునకు అనుగుణంగా పింఛనుదారులంతా సర్టిఫికెట్లు అందించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో లేదా నేరుగా తమ కార్యాలయానికి వచ్చి అయినా అందించవచ్చునని పేర్కొన్నారు.

## మెగా టీచర్ పేరెంట్స్ మీటింగ్‌కు ఏర్పాట్లు



జడ్పీ బాలికల హైస్కూల్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

చోడవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించనున్న మెగా టీచర్ పేరెంట్స్ మీటింగ్‌కు ఏర్పాట్లను శుక్రవారం మండల నోడల్ అధికారుల బృందం పరిశీలించింది. మండలంలోని 61 పాఠశాలల్లో ఈ సమావేశాల నిర్వహణకు అవసరమైన ఏర్పా ట్లకు ఎండీవో, తహసీల్దార్‌ల ఆధ్వర్యంలో నోడల్ టీం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఈ నోడల్ అధికారుల బృందం స్థానిక కొత్తూరు బాలికల హైస్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె. సింహాచలం, ఈవో మహేష్, ఎస్ ఐలు నాగకార్తీక్, బి. జోగారావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నాదెండ్లకు ఘన స్వాగతం



మంత్రి నాదెండ్లకు స్వాగతం పలుకుతున్న జనసేనేతలు

చోడవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు నియోజకవర్గ జనసేన నేతలు ఘన స్వాగతం పలికారు. అల్లూరి జిల్లా పర్యటనకు వెళుతున్న నాదెండ్లకు శుక్రవారం ఉదయం బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాదెండ్ల కొద్దిసేపు కార్యకర్తలతో మాట్లాడి స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.



చౌడవాడలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు



చోడవరంలో సదస్సులో అధికారులు



దేవరాపల్లి మండలం బైలపూడిలో మాట్లాడుతున్న

# రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికే సదస్సులు

» రావికమతం మండల ప్రత్యేక అధికారి వసంతరావు

రావికమతం, డిసెంబరు 6,(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి గ్రామ స్థాయిలో సదస్సులు నిర్వహిస్తున్నట్టు మండల ప్రత్యేక అధికారి కె.వసంతరావు తెలిపారు. శుక్రవారం మండలంలో తట్టబంద గ్రామంలో ఆయన రెవెన్యూ సదస్సును ప్రారంభించి మాట్లాడారు. భూముల రీ సర్వే జరిగిన గ్రామాలతో పాటు జరగని గ్రామాల్లోనూ సదస్సుల ద్వారా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. భూముల విస్తీర్ణం,సర్వే నంబరు, సరిహద్దులలో వ్యత్యాసాలపై రైతులు ఫిర్యాదులు సమర్పించాలని ఆయన కోరారు. తట్టబంద గ్రామ సర్వే 41,42కు చెందిన భూ స్వామికి కొంత మంది రైతులకు నెలకొన్న వివాదం వల్ల సుమారు 650 ఎకరాల భూములకు చేర్పులు, మార్పులపై నిషేదం విధించింది. అయితే సాగులో ఉండి వివాదంలేని రైతులు ఇబ్బందులు పరిష్కరించాలని సర్పంచ్ గోకివాడ రమణ అధికారుల దృష్టికి ఈ సందర్భంగా తీసుకొచ్చారు. ఈ రైతులు బ్యాంకుల నుంచి రుణాలు పొందలేకపోతున్నారని, అవసరాలకు భూములను విక్రయించుకోవడం వీలుకావడంలేదని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సతీష్, సర్వేయర్ సురేష్, మండల పరిషత్ సూపరిండెంట్ స్వామి పాల్గొన్నారు.

## చోడవరంలో..

చోడవరం: గ్రామాల్లో భూ సంబంధిత సమస్యలను రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ అంబటి రామారావు విజ్ఞప్తి చే శారు. శుక్రవారం మండలంలోని వెంకన్నపాలెంలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మురుకుటి రమణ, జనసేన నాయకులు సియ్యాద్రి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

**చీడికాడ:** గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి మూర్తి కోరారు. మండలంలోని తిరువూరు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యలపై వెంటనే అధికారులతో పరిష్కరించేందుకు ఈ సదస్సులను ప్రవేశపెట్టిందన్నారు. దీన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో 8 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ సదస్సుల్లో తహసీల్దార్ ప్రసాద్, డీటీ సత్యనారాయణ, సర్పంచ్ మట్టా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## కె. కోటపాడు మండలంలో..

కె.కోటపాడు : భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి. భాగ్యవతి కోరారు. మండలంలోని చౌడువాడ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వివిధ భూ సమస్యల పై ఎనిమిది అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారి పూర్ణిమదేవి, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, వీఆర్వోలు పూడి సురేష్, శేషగిరి, అనంత్, గౌరీ శంకర్ పాల్గొన్నారు.

## దేవరాపల్లి మండలంలో..

దేవరాపల్లి: భూసమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు అని ఎంపీపీ చింతల బుల్లి. లక్ష్మి అన్నారు. మండలంలోని రైవాడ పంచాయతీ బేతపూడి రైతు భరోసా కేంద్రం వద్ద రెవెన్యూ సదస్సు సర్పంచ్ చల్లా.లక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మంజులవాణి, తహసీల్దార్ లక్ష్మీదేవి, చల్లా నానాజీ, తాతయ్యలు, తదితరులు పాల్గొన్నారు.

# పేరెంట్స్ కమిటీ సమావేశాలకు ఆహ్వానం



విద్యార్థి తండ్రిని ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయినిలు

చోడవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో శనివారం నిర్వహించనున్న పేరెంట్ కమిటీ సమావేశానికి ఆహ్వానపత్రికలు రూపొందించి శుక్రవారం వారం విద్యార్థుల తల్లిద్రండులను ఆహ్వానించారు.ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు బొట్టుపెట్టి మరీ సమావేశానికి స్వాగతం పలుకుతున్నారు. జుత్తాడ హైస్కూల్‌లో విద్యార్థినులు రూపొందించిన ఆహ్వానపత్రికతో ఉపాధ్యాయినిలు స్కూల్ కమిటీ చైర్మన్ చిన్నారావుకు బొట్టుపెట్టి ఆహ్వానం పలికారు. పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్



కొత్తకోటలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ



దేవరాపల్లిలో పూలమాలలువేస్తున్న వేస్తున్న సభ్యులు

రావికమతం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):భారత జాతిని జాగృతి పరిచిన ఆదర్శమూర్తి బాబాసాహెబ్ అంబేడ్కర్ అని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. కొత్తకోటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలలు వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేడ్కర్ నేటి తరానికి స్ఫూర్తిదాత అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాంగ బద్ధంగా హక్కులు కల్పించారన్నారు. రాజ్యాంగ నిర్మాతగా, న్యాయ శాస్త్ర నిపుణుడిగా, ఆర్థిక వేత్తగా, ఖ్యాతి గాంచారన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం,రావికమతం ఎంపీపీలు గాడికాసులమ్మ, పైలరాజు, మండల కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు,గుమ్ముడు సత్యదేవా, సర్పంచ్ కోన లోవరాజు, ఎంపీటీసీ సభ్యుడు పూడి దేవా పాల్గొన్నారు.

**అంబేడ్కర్‌కు మంత్రి నాదెండ్ల నివాళి**

**చోడవరం:** వడ్డాదిలో నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**దేవరాపల్లి:** సమాజంలో సమానత్వం కోసం అంబేడ్కర్ పోరాటం చేశారని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు అన్నారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో అం బేడ్కర్ కాలనీ, నాలుగు రోడ్ల కూడలిలో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ కృష్ణమూర్తి కాటపల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. వేచలంలో అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఉపముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు, జడ్పీటీసీ సభ్యులు కర్రి.సత్యం, బూరే బాబూరావు నివాళులర్పించారు.

# రోజంతా బిజీ బిజీ

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సక్సెస్


పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు


ఎన్టీఆర్ విగ్రహానికి పూలు వేసి నివాళులర్పిస్తున్న సీఎం


డీప్ టెక్నాలజీ సదస్సులో డెలిగేట్స్‌తో సీఎం నారా చంద్రబాబునాయుడు


ముఖ్యమంత్రితో సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థులు


స్టాల్స్‌లో పరికరాల పనితీరు తెలుసుకుంటున్న సీఎం

- పార్టీ కార్యాలయంలో వినతులు ఇచ్చేందుకు పోటీపడిన ప్రజలు
- అధినేతను కలుసుకునేందుకు బారులుతీరిన నాయకులు


నగరంలో ఒకరోజు పర్యటనకు గురువారం రాత్రి పార్టీ కార్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం రోజంతా బిజీగా గడిపారు. ఉదయం పార్టీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా నుంచి బాధితులను కలిసి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనతో ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. అనంతరం నోవాటెల్ హోటల్‌లో డీప్ టెక్నాలజీపై నిర్వహించిన జాతీయ సదస్సులో ప్రసంగించారు. స్టార్టప్‌లను ప్రోత్సహించే దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. కాగా సాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రి విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో విజయవాడ వెళ్లారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


డీప్ టెక్నాలజీ సదస్సుకు హాజరైన ప్రతినిధులు


డీప్ టెక్ సదస్సుకు హాజరవుతున్న ముఖ్యమంత్రి


డీప్ టెక్ ఎగ్జిబిషన్‌పై సీఎంకు వివరిస్తున్న అధికారులు


సీఎం చంద్రబాబును కలిసేందుకు వచ్చిన మంత్రులు కొల్లు రవీంద్ర, డోలా బాలవీరాంజనేయ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి, పంచకర్ల, నాయకులు


పార్టీ కార్యాలయంలో సీఎంను కలిసేందుకు వచ్చిన ఉమ్మడి జిల్లా టీడీపీ నాయకులు


డీప్ టెక్నాలజీ సదస్సుకు హాజరైన పారిశ్రామికవేత్తలు, నాయకులు

## ఇరువాడలో వాగు కబ్జాపై సీఎంకు ఫిర్యాదు

సబ్బవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువాడ గ్రామంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న 103, 106 సర్వే నంబర్లలోని వాగులు ఆక్రమణకు గురయ్యాయని గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు శుక్రవారం విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం గతంలో పలుమార్లు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. గ్రామస్థులు ధర్నాలు చేసి తహసీల్దార్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వినతిపత్రంలో సీఎంకు వివరించారు. మూడు ఎకరాల మేర వాగులను ఆక్రమించి లే-అవుట్ వేశారని, రహదారి నిర్మించారని వివరించారు. ప్రస్తుత మాడుగుల ఎమ్మెల్యే గతంలో స్వయంగా పరిశీలించి, ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేసినా రెవెన్యూ అధికారులు సర్వే చేసి చేతులు దులుపుకున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. అప్పటి వైసీపీ నేతలు అండదండలతో ఈ ఆక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆక్రమణకు గురైన భూమి విలువ రూ.18 కోట్లు ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి స్పందించి ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు.

## పంచాయతీలకు కేంద్ర అవార్డులు రావడంపై ఎంపీ రమేశ్ హర్షం


ఎంపీ సీఎం రమేశ్

కొత్తూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో నాలుగు పంచాయతీలకు పురస్కారాలు ప్రకటిస్తే వాటిలో రెండు పంచాయతీలు అనకాపల్లి జిల్లాకు రావడం పట్ల ఎంపీ సీఎం రమేశ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించే దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ అవార్డులు సఫిషియెంట్ విభాగంలో నక్కపల్లి మండలం న్యాయపూడి పంచాయతీ, పచ్చదనం పరిశుభ్రత విభాగంలో అనకాపల్లి మండలం తగరంపూడి పంచాయతీలకు లభించడం అభినందనీయమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీల అభివృద్ధికి విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో స్థానిక సంస్థల పాలనను బలోపేతం చేసి సుస్థిర అభివృద్ధి సాధనకు ప్రోత్సాహం ఇవ్వడంతో రాష్ట్రంలో పంచాయతీలు అంకితభావంతో పనిచేస్తున్నాయన్నారు.

## పాఠశాల పారిశుధ్య కార్మికురాలి మృతి


మృతురాలు ఏడిద కుమారి (ఫైల్)

ఎస్.రాయవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పారిశుధ్య కార్మికురాలు ఏడిద కుమారి (40) విధి నిర్వహణలో శుక్రవారం మృతిచెందింది. పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రపరుస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందినట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం జావీద్ హుస్సేన్ తెలిపారు. ఈ విషయాన్ని హెచ్‌ఎం ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. కుమారికి ఇద్దరు కుమార్తెలు ఉండగా.. వారికి వివాహం అయ్యింది. ఆమె చిన్న కుమార్తె, అల్లుడుతో కలిసి ఉంటున్నది. విధి నిర్వహణలో మృతి చెందిన పారిశుధ్య కార్మికురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని దళిత కాలనీ వాసులు కోరుతున్నారు.



## నేడు పాఠశాలల్లో పండుగ

... 7వ పేజీ తరువాయి

విడుదలయ్యాయి. ఇవి సరిపోయే అవకాశం లేనందున ప్రతి పాఠశాలలో కాంపోజిట్ గ్రాంటు నుంచి కొంత మొత్తం ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పించారు. తొలుత తల్లిదండ్రులకు సంబంధించి మహిళలకు ముగ్గులు పోటీలు, పురుషులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తారు. అనంతరం తల్లిదండ్రులతో సంబంధిత టీచర్ తరగతి గదిలో సమావేశమై ఇప్పటివరకూ నిర్వహించిన ఎఫ్‌ఎ-1, 2 పరీక్షల మార్కుల వివరాలతో కూడిన ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తారు. విద్యార్థులకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షల వివరాలను కార్డులో పొందుపరుస్తున్నారు. విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, ఇతర అంశాలను తల్లిదండ్రులకు తెలియజేసి వారికి సూచనలు చేయడంతో పాటు సలహాలు స్వీకరిస్తారు. అనంతరం అన్ని తరగతుల విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి పాఠశాల అభివృద్ధికి, బోధనకు సంబంధించి సూచనలు తీసుకుంటారు. ఆ తరువాత విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు భోజనం ఏర్పాటుచేస్తారు.

జిల్లాలో వివిధ ప్రభుత్వ యాజమాన్యాల కింద నడుస్తున్న 1,447 పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,04,952 మంది విద్యార్థులు వున్నారు. వీరితోపాటు తల్లిదండ్రులకు కలిపి మధ్యాహ్నం భోజనాలు సిద్ధం చేస్తున్నారు. మెనూ ప్రకారం అన్నం, పప్పుచారు, కూర, స్వీట్ పొంగలి, శనగపప్పు చిక్కీ అందిస్తారు. జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించే మెగా పేరెంట్స్ మీట్‌లో తల్లిదండ్రులు విధిగా పాల్గొని జయప్రదం చేయాలని డీఈఓ గిడ్డి అప్పారావు నాయుడు పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ పాల్గొని సహకరించాలన్నారు.

## న్యాయంపూడికి నేషనల్ అవార్డు

... 7వ పేజీ తరువాయి

పంచాయతీకి జాతీయ స్థాయిలో మొదటి స్థానం లభించిందని ఎంపీడీవో సీతారామరాజు, పంచాయతీ సర్పంచ్ రెడ్డి వరహాలబాబు, కార్యదర్శి నరసింహరాజు చెప్పారు. పంచాయతీ పరిధిలో ప్రతీరోజూ క్రమం తప్పకుండా ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు సరఫరా చేయడం, పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేస్తుండడంతో జాతీయ పురస్కారానికి ఎంపికైందని వారు పేర్కొన్నారు ఈ నెల 11న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురస్కారంతోపాటు కోటి రూపాయల చెక్కును అందజేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి హాజరుకానున్నారు. ఎస్.నర్సింహరాజు ఢిల్లీ వెళ్లనున్నారు.

### న్యాయంపూడిలో సంబరాలు

జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక అయిన విషయం తెలుసుకున్న న్యాయంపూడి గ్రామస్థులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల కృషి, తమ సహకారంతో జాతీయ స్థాయి పురస్కారానికి తమ గ్రామం ఎంపికైందని అభిప్రాయపడుతున్నారు. సర్పంచ్ రెడ్డి వరహాలు, కార్యదర్శి నరసింహరాజులను ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

### అధికారుల ప్రోత్సాహంతోనే...

**ఎస్.నరసింహరాజు, పంచాయతీ కార్యదర్శి, న్యాయంపూడి**



జిల్లా కలెక్టర్, డీపీవో, ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు ఎన్నో విలువైన సూచనలు చేస్తూ, ప్రోత్సాహం అందించేవారు. ఉన్నతాధికారులు చెప్పిన ఏ పనైనా సరే బరువు అనుకోకుండా, బాధ్యతగా పనిచేశాను. గ్రామస్థుల సహకారం మరువలేనిది. నేను పనిచేస్తున్న పంచాయతీ జాతీయస్థాయి పురస్కారానికి ఎంపిక కావడం మాటల్లో వర్ణించలేనంత ఆనందంగా వుంది. భారత రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాన్ని స్వీకరించనుండడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను.

## మన్యంలో వెంకన్న ఆలయం నిర్మించాలి

పాడేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మన్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు ఈవో వెంకయ్యచౌదరిని కోరినట్టు జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం టీటీడీ అదనపు ఈవోను కలిసి మన్యానికి సంబంధించి పలు అంశాలపై వినతిపత్రం ఇచ్చినట్టు ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో ఏజెన్సీలో వెంకన్న ఆలయాన్ని, పలు చోట్ల కల్యాణ మండపాలను నిర్మించాలని, టీటీడీకి చెందిన విభాగాల్లో గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, గిరిజన కాఫీని ప్రమోట్ చేయడంతో కాఫీ స్టాల్‌ను ఏర్పాటు చేయాలని ఆయనను కోరినట్టు శ్రావణ్‌కుమార్ వివరించారు.

## ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ

... 7వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేశారు. పీఎం పాలెంలో మసీదును కొందరు అరాచకశక్తులు ఆక్రమించుకుని తోటి ముస్లింలను ఇబ్బందులు పెడుతున్నారని షేక్ సుభాని, టీడీపీ సానుభూతిపరుడనే అక్కసుతో ఏయూ మాజీ వీసీ తనకు రావల్సిన ఇంక్రిమెంట్లు నిలుపుదల చేశారని పరీక్షల విభాగం సూపరింటెండెంట్ నవర దావీదురావు ఫిర్యాదు చేశారు. మద్యంపై ప్రస్తుతం ఇస్తున్న 9.5 శాతం కమీషన్‌ను 20 శాతానికి పెంచాలని డీలర్లు కోరారు. 2020లో విశాఖ ఎయిర్‌పోర్టుకు వచ్చిన తమను (చంద్రబాబు) అడ్డుకున్న వైసీపీ నేతలపై చర్యలు విషయంలో పోలీసులు తాత్సారం చేస్తున్నారని టీడీపీ పీఆర్వో కె.గోపాలరెడ్డి ఫిర్యాదు చేశారు. వైసీపీ కీలక వ్యక్తులను ఉద్దేశపూర్వకంగా అప్పటి పోలీసులు తప్పించి, సామాన్య కార్యకర్తల పేర్లను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వైసీపీ నాయకుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## విశాఖ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

... 7వ పేజీ తరువాయి

రైల్వే జోన్ ఏర్పాటు కాబోతోందని, భవన నిర్మాణ ప్రక్రియ త్వరలో మొదలవుతుందన్నారు. స్టీల్‌ప్లాంటును కాపాడుకు నేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. విశాఖకు కూడా సీ ప్లేన్ అనుకూలతను పరిశీలిస్తున్నామని వివరించారు. తాను ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాలను చూశానని, ఇటువంటి భిన్నమైన నగరాన్ని ఎక్కడా చూడలేదన్నారు. మంచి, చెడులను గమనించి నిర్ణయాలు తీసుకోవడంలో ఇక్కడి ప్రజలు ముందుంటారన్నారు.

### నేడు ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం

... 7వ పేజీ తరువాయి

ఎస్.వి.ఆదినారాయణ, విశిష్ట అతిథిగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌తో పాటు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గ్రంధి మల్లికార్జునరావు, చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావుతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరుకానున్నారు.

**ఇదీ షెడ్యూల్..**

బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో శనివారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. 5.30 గంటలకు అతిథుల ప్రసంగాలు ప్రారంభమవుతాయి. ఇవి రెండు గంటలు కొనసాగుతాయి. రాత్రి 8 గంటలకు వేడుకలు ముగియనున్నాయి.

## అత్యాచార కేసులో ముద్దాయికి 25 ఏళ్ల జైలు

» రూ. 1.25 లక్షల జరిమానా

సబ్బవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సబ్బవరంలో బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయికి విశాఖపట్నం పోక్సో కోర్టు 25 ఏళ్ల కారాగార శిక్ష, రూ.1.25 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. స్థానిక సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలానికి చెందిన బాలికను నిందితుడు తాంబరి త్రినాథ్(35) పలు మార్లు అత్యాచారం చేశాడు. ఈ విషయం తల్లికి చెబితే వాళ్ల అమ్మను చంపేస్తానని నిందితుడు భయపెట్టడంతో బాలిక ఎవరికీ ఈ విషయాన్ని చెప్పలేదు. సెలవులకు పెద్దమ్మ ఇంటికి వెళ్లినప్పుడు అమ్మ తిరిగి ఇంటికి వచ్చేయమని ఫోన్ చేసింది. అప్పుడు బాలిక ఒక లెటర్ రాసి పెద్దమ్మ ఇంట్లో పెట్టి వచ్చేసింది. ఆ లెటర్‌ను బాలిక పెద్దమ్మ చూసి విషయం అడగడంతో అత్యాచారం విషయం బయటకు వచ్చింది. తొలి నుంచి జరిగిన విషయాన్ని బాలిక తల్లితో చెప్పింది. పెద్దమ్మ, తల్లి సహకారంతో బాలిక 2022 జూలై 7న పోలీసులను ఆశ్రయించగా అప్పటి ఎస్‌హెచ్‌వో సీహెచ్‌వీవీఎస్ చంద్రశేఖర్ పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. పోలీసులు కోర్టు ముందు అన్ని ఆధారాలు ఉంచారు. నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు న్యాయమూర్తి జి. ఆనంది నిందితుడు తాంబరి త్రినాథ్‌కు పైవిధంగా శిక్ష విధించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.4 లక్షలు పరిహారంగా ఇవ్వాలని తీర్పులో న్యాయమూర్తి వెల్లడించారు. ఎస్పీ తుహిన్ సిన్హా దర్యాప్తు అధికారులైన అప్పటి ఇన్‌స్పెక్టర్ సీహెచ్‌వీవీఎస్ చంద్రశేఖర్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు, వాదనలు వినిపించిన స్పెషల్ పీపీని, కోర్టు మానటరింగ్ సెల్ సిబ్బందిని అభినందించారని సీఐ రమణ తెలిపారు.

క్రైం... crime news

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్ పరిధిలోని అనకాపల్లి వైపు వెళ్లే ప్లాట్‌ఫారం వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి శుక్రవారం తెలిపారు. మృతుని వయసు 35 నుంచి 40 ఏళ్ల ఉంటుందన్నారు. 5.5 అడుగుల ఎత్తు, చామనచయ రంగు కలిగి ఉన్నాడన్నారు. తెలుపు, నలుపు నిలువ గీతల ఫుల్‌హ్యాండ్ షర్టు, మెరున్ కలర్ ఫుల్‌ప్యాంట్, నలుపురంగు తువ్వాలు ధరించి ఉన్నాడన్నారు. మృతుడి కుడి చేతి పైన అన్నపూర్ణ తమ్ముడు తెలుగులో పచ్చబొట్టు ఉందని, మృతుని కుడి చాతిపై నాన్న, ఎడమ చాతిపై అమ్మ అనే పచ్చబొట్టు తెలుగులో ఉన్నాయన్నారు. సంఘటన స్థలం పరిసరాల్లో గాలించినా ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృతుడిని గుర్తించినట్టయితే సెల్ నంబరు 7382058996 కాల్ చేయాలని ఎస్‌ఐ కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## గాయపడిన వ్యక్తి మృతి

రావికమతం, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తకోట శివారులో గురువారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో గాయపడిన రోలుగుంట మండలం రత్నంపేటకు చెందిన బత్తిన సత్తిబాబు (70) నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు కొత్తకోట ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. మృతుడు సోంబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. ప్రమాదానికి కారణమైన టి.అర్జాపురం గ్రామానికి చెందిన గల్లా శివరామరాజుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతి చెందిన వరహాలరావు(ఫైల్)

కోటవురట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల, నర్సీపట్నం మండలాల సరిహద్దుకు సమీపంలో ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ రమేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామానికి చెందిన మేలాసు వరహాలరావు (55) శుక్రవారం వ్యవసాయ పనులు ముగించుకొని మధ్యాహ్నం మండలంలోని బీకేపల్లి గ్రామానికి బైక్ వెళుతుండగా నర్సీపట్నం, కోటవురట్ల మండలాల సరిహద్దు ప్రాంతంలో ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వరహాలరావు తలకు బలమైన గాయం కావడంతో చాలా రక్తం పోయింది. స్థానికులు గాయపడిన వ్యక్తిని 108 అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వరహాలరావు మృతి చెందాడు. భార్య చెల్లయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వరహాలరావుకు ఇద్దరు కుమార్తెలున్నారు.

## బావిలో స్నానానికి దిగి ఒకరి మృతి

కొత్తూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ విలీన గ్రామమైన ఎరుకువానిపాలెం నేల బావిలోకి స్నానానికి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాకలో నివాసముంటున్న మేడిశెట్టి రవికుమార్ (48) తన తల్లితో కలిసి అనకాపల్లి మండలం ఎరుకువానిపాలెం గ్రామానికి వచ్చాడు. గ్రామంలో తన ఇంటి వద్ద తల్లిని ఉంచి రవికుమార్ చేనులో ఉన్న నేలబావిలోకి స్నానానికి దిగాడు. లోతు ఎక్కువగా ఉండడం వల్ల బావిలో కూరుకుపోయి మృతి చెందాడు. ఈ విషయాన్ని అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని బావిలోంచి బయటకు తీశారని చెప్పారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచామని ఆయన ఎస్‌ఐ తెలిపారు. భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవికుమార్ చెప్పారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 85.00 |
| లైవ్ ధర | 105.00 |
| విత్ స్కిన్ | 180.00 |
| స్కిన్ లెస్ | 190.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 610 |
| విజయనగరం | 614 |
| శ్రీకాకుళం | 614 |